Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 24.02.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# ఓట్లు తెచ్చేది ఒక్కటీ లేదు!

వలస వచ్చిన నాయకులు... అడ్డదారుల్లో పోగేసిన కోట్ల కొద్ది డబ్బు... అనుకూల మీడియా ప్రచారం... వచ్చే ఎన్నికలలోనూ తమను ఇవే గెలిపిస్తాయని చంద్రబాబు నమ్ముతున్నాడా? వచ్చే ఎన్నికలు వన్‌సైడ్‌గా జరగాలి, ప్రతిపక్షం ఉనికి ఉండకూడదు అన్నట్లుగా ఆయన మాట్లాడడం చూస్తుంటే చంద్రబాబు పైవాటిని బలంగానే నమ్ముతున్నట్లుగా వుంది.

- ➤ చంద్రబాబు మూడేళ్ళ పాలనపై పెదవి విరుపు
- ➤ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత
- ➤ పాజిటివ్ ఓటు మటుమాయం

ఏ ప్రభుత్వానికైనా లేదా ఏ నాయకుడిని చూసైనా ఓటేయాలంటే ఒక్కటైనా బలమైన కారణముండాలి. 1983లో కేవలం కాంగ్రెస్ మీద వ్యతిరేకత, సినీ గ్లామర్ కారణంగా ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాడు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఎన్టీఆర్ గెలుపుకు ఇవి దోహదపడలేదు. ఆ రెండేళ్లలో ఆయన రెండురూపాయల కిలో బియ్యంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను అమలు చేసారు.

(మిగతా 11వ పేజీలో)

**ఉద్యోగుల్లో అసహనం... నిరుద్యోగుల్లో అసంతృప్తి... మహిళల్లో ఆగ్రహం... రైతుల్లో ఆవేదన... ప్రజల్లో ఆందోళన!**





# ఆనం ఆటకు చెక్

- టీడీపీ కాంగ్రెస్ కావచ్చేమో..! బాబు వై.యస్. కాలేడు?

తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీ కావొచ్చేమో... చంద్రబాబు నాయుడు మాత్రం వై.యస్.రాజశేఖర్‌రెడ్డి కాలేడు... తెలుగుదేశం పార్టీలో చేరిన నాయకులందరికీ ఈ పాటికి ఈ విషయం అర్థమై ఉంటుంది. ఆనం సోదరులకు కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరే ముందే ఈ విషయం తెలిసినా చంద్రబాబుతో వున్న (మిగతా 11వ పేజీలో)

# కేసీఆర్‌కు సరెండర్

## › తెలంగాణలోనూ కులం కుమ్మక్కు!

*ఓ పక్క కులాలను పక్కనపెట్టాలంటున్నాం, మతాలను మరచిపోదామంటున్నాం... ఇంకో పక్క చూస్తే దేశ రాజకీయాలను కులాలే శాసిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఉత్తరప్రదేశ్ దాకా ప్రతి రాష్ట్రంలోనూ కులపోకడలే ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తున్నాయి.*

ఇంతకుముందు ఏ రాష్ట్రంలోనైనా రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటే వాటి విజయావకాశాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు రెండు బలమైన కులాలు కలిస్తే గెలుపు ఖాయమనే పరిస్థితి వచ్చింది. 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో దీనిని ప్రాక్టికల్‌గా విజయవంతం చేసి చూపించాడు చంద్రబాబునాయుడు. ఏపిలో రాజకీయంగా మూడు ప్రధాన అగ్రకులాలుంటాయి. రెడ్డి, కమ్మ, కాపు... ఈ మూడు కులాలలో ఏ రెండు కులాలు కలిస్తే వారికే అవకాశాలెక్కువగా ఉంటాయి. గత ఎన్నికల్లో కమ్మ, కాపు కాంబినేషన్ కుదిరింది. పవన్ కళ్యాణ్‌ను గడ్డం పట్టుకునైతేనేమీ, కాపులకు రిజర్వేషన్లు, డిప్యూటీ సీఎం వంటివి ఎరవేయడం వల్లనైతేనేమీ చంద్రబాబు ఈ రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లయిన కాపుల మద్దతు పొందగలిగాడు. ఈరోజు రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో ఉందంటే అది కాపుల పుణ్యమే!

చంద్రబాబు ఇదే ఫార్ములాను రేపు తెలంగాణలోనూ అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. తెలంగాణలో తెలుగుదేశం ఎత్తిపోయింది. ముఖ్యమైన నాయకులందరూ టిఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. రేవంత్‌రెడ్డి లాంటి ఒకరిద్దరు వూరేగుతున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పూర్తిగా తుడిచిపెట్టుకుపోకుండా చూడాలని, ఉనికిని కాపాడుకోవాలని చంద్రబాబు ఆరాట పడుతున్నాడు. తెలంగాణలో ఇక అధికారం మీద ఆశ లేదు. మొన్న గ్రేటర్ ఎన్నికల్లోనే అది తేలిపోయింది. కనీసం పార్టీనన్నా నిలబెట్టుకోవాలి. ఇందుకోసం టీఆర్‌ఎస్‌కు తోక పార్టీగా ఉంటే చాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఇక్కడా కులం ఈక్వేషన్స్‌ను తెరమీదకు తెస్తున్నారు. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ప్రధాన పోటీ కాంగ్రెస్సే! ఆ పార్టీలో రెడ్లదే ఆధిపత్యం. టీఆర్‌ఎస్‌లో ఇప్పుడున్న రెడ్లు రేపు కాంగ్రెస్‌లోకి పోరనే గ్యారంటీ ఏమీ లేదు. కాబట్టి తెలంగాణలో రెడ్లకు పోటీగా బలమైన సామాజిక వర్గాలైన వెలమ, కమ్మలను ఒక గూటికి చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈమేరకు తెలుగుదేశం, టీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఓ విడత చర్చలు కూడా జరిగాయి. ఈ రెండు కులాలను ఏకం చేసే ఆపరేషన్ బాధ్యతలను చంద్రబాబు చెక్కభజన మీడియాగా పేరుగాంచిన ఓ మీడియా సంస్థ అధినేతకు అప్పగించినట్లు తెలుస్తోంది.

## శ్రద్ధాంజలి



**శ్రీ ఇరిగినేని తిరుపతి నాయుడు**
మాజీ శాసనసభ్యులు, కనిగిరి, ప్రకాశం జిల్లా.

ప్రజానేతగా...సమర్థ రాజకీయవేత్తగా...
**ప్రజలమదిలో మీస్థానం ప్రత్యేకం**

జగతివున్నంత వరకూ జనంగుండెల్లో నిలిచిపోయే మీ మంచితనానికి,
మానవత్వపు విలువలకు, మహోన్నత వ్యక్తిత్వానికి మా శ్రద్ధాంజలి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాని భగవంతుని వేడుకుంటూ...

బాధాతప్త హృదయులైన ఇరిగినేని రవీంద్రబాబుకు, కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేస్తున్నాము.

**బీద రవిచంద్ర, MLC**
అధ్యక్షులు,
నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ

**బీద మస్తాన్ రావు, Ex. MLA**
సభ్యులు, నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ కమిటీ
చైర్మన్: BMR గ్రూప్

మరియు **BMR స్టాఫ్**, నెల్లూరు, చెన్నై, వైజాగ్.

# టైంస్కేల్ ఉద్యోగులకు పిఆర్‌సి వర్తింపు

**షేక్ రియాజ్‌అహ్మద్**



మంత్రి యనమలతో చర్చిస్తున్న జేఏసీ నాయకులు అశోక్‌బాబు, షేక్ రియాజ్‌అహ్మద్ తదితరులు

పంచాయతీరాజ్ శాఖలో టైం స్కేల్ ఉద్యోగులకు పదో పీఆర్సీ వర్తింపునకు ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు సూచన ప్రాయంగా అంగీకరించినట్లు ఏపి పంచాయితీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మంగళవారం తెలిపారు. జేఏసీ చైర్మెన్ అశోక్‌బాబుతో కలిసి ఆ సంఘ నాయకులు మంత్రి కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావుతో విజయవాడలో ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు మంత్రి వర్గ బృందాన్ని కలిసి పీఆర్‌సిపై చర్చించినట్లు తెలిపారు. ఉద్యోగుల వేతనం పెంపు, రెగ్యుల రైజేషన్, పిఆర్‌సి బకాయిలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

సింహపురి సమాచారం

# శవమై తేలిన సమాచార హక్కు పోరాటకుడు

సమాచారహక్కు రక్షణ సమాఖ్య కన్వీనర్, వియ్ హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకుడు పుత్తా వీరభద్రయ్య(46) అనుమానాస్పద స్థితిలో ఈ నెల 19వ తేదీన రైలు పట్టాలపై శవమై తేలాడు. నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లెక్చ రర్స్ కాలనీ సమీపాన వున్న రైలు పట్టాలపై ఆయన మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహం పడివున్న తీరును చూస్తే గొంతు కోసి హత్యచేసి రైలు పట్టాలపై పడేసినట్లుగా వుంది. ఉస్మాన్‌సాహెబ్ పేటకు చెందిన వీరభద్రయ్య పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇటీవల సమాచారహక్కు రక్షణ సమాఖ్య జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. పలు శాఖల్లో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలను వివరిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేవాడు. ఈమధ్య రెడ్‌క్రాస్



ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఆసుపత్రితో పాటు మిగిలిన దాని అనుబంధ సంస్థల్లో దీర్ఘకాలికంగా పాతుకుపోయిన పెత్తందారి వ్యవస్థపైనా, అలాగే ఆయా సంస్థల్లో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపైన ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలు స్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో వీర భద్రయ్య మరణం అనేక అనుమానా లకు తావిస్తోంది. అతనిని చంపి దానిని ఆత్మ హత్యగా చిత్రీకరించడానికి మృత దేహాన్ని రైలు పట్టాలపై పడేసారని భావి స్తున్నారు. తలపై గాయం, గొంతు కోసి ఉండడంతో అతనిది ఆత్మహత్య కాదని, హత్యేనని భావిస్తున్నారు. నెల్లూరు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పోలీ సులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సి వుంది. అన్యాయాన్ని ప్రశ్నించిన వీరభద్రయ్య శవంగా మారడాన్ని సామాజిక వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. అన్యాయాన్ని ప్రశ్నించవారికి ఇదేనా శిక్ష అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై కలెక్టర్ కూడా జోక్యం చేసుకోవాల్సి వుంది.

# జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్



బోగోలు మండలం, జువ్వలదిన్నెలో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్ ప్రగతి నివేదికపై బుధ వారం డబ్ల్యుఏపిసిఓఎస్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును కలసి వివరించారు. నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతి నిధులు పిటి జాయ్, ఎంజె మొథాయిల్‌లు కలసి హార్బర్‌కు చెందిన డిపిఆర్ నివే దికను ఈ ఏడాది జులై నాటికి ప్రభుత్వా నికి అంద జేస్తామని తెలిపారు. ఈ సంద ర్భంగా అందుకు సంబంధించిన పర్యా వరణ అనుమతులను త్వరితగతిన పొందా లని వారికి కలెక్టర్ సూచించారు. మత్స్య శాఖ జె.డి సీతారామరాజు మాట్లాడుతూ డబ్ల్యు ఏపిసిఓఎస్ అధికారుల అంచనా ప్రకారం సుమారు 250 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.


## వృద్ధాప్యంలో తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి



కని, పెంచి విద్యాబుద్ధులు నేర్పి పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా జాగ్రత్తగా చూసుకోవాలని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్ అన్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల అంశమై ముద్రించిన కరపత్రాన్ని విడుదల చేశారు. రైతు సంఘం నాయ కులు కోటిరెడ్డి, ప్రముఖ విద్యావేత్త ఆచార్య ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ ఆలయానికి 5 లక్షల విరాళం

సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళపర మేశ్వరి అమ్మవారి ఆలయానికి విజయ వాడకు చెందిన ముక్కమాల వెంకటేశ్వర్లు–కనకదుర్గ దంపతులు, వారి కోడలు అరుణ జ్ఞాపకార్థం 5 లక్షల విరాళాన్ని మంగళ వారం వారు ఆలయ చైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు.

# ఎట్టా బతకాల దేవుడా?




'సాగునీరూ లేదు..తాగునీరూ లేదు.. ఎట్టా బతకాల దేవుడా' అంటూ కనుపూరుకాలువ పరిధిలోని అనేక గ్రామాల్లో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావంతో ఎక్కడా చినుకులు రాలక పోవడంతో ఇక్కడి పంటచేలు బీళ్ళు పడిపోతున్నాయి..చెరువులు దొరువులన్నీ ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ కాలువ పరిధికింద సుమారు 33 వేల ఎకరాలకు పైగానే ఆయకట్టు వుంది. ఈ ఆయకట్టుకు 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అధికారులు హామీ అయితే ఇచ్చారు కానీ, ప్రస్తుతం సాగునీటి కొరత వుండడంతో కేవలం 14వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు పంపిణీ చేశారు. దీంతో, మిగిలిన రైతాంగానికి పొలాలకు నీరందక, అటు తాగునీరు లేక..చివరికి పశువులకు మేత కూడా దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆయా గ్రామాల్లోని ఎంతోమంది రైతులు కంటతడిపెడుతున్నారు. సోమశిల జలాశయంలో ఇప్పుడు 24 టిఎంసిల నీరుంది. అధికారులు సాగునీరిస్తామని తొలుత హామీ ఇచ్చినా ఇప్పుడు మెట్టపైరుకు కూడా నీరివ్వలేమంటున్నారని రైతుల వాపోతున్నారు. పంటలు లేకపోవడం ఒక బాధైతే, ఈ కరువు బారినుంచి మూగజీవాలను ఎలా బతికించుకోవాలన్నది మరో వేదన అంటూ ఆయా ప్రాంతాల్లోని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆయకట్టు కింద వున్న 40 గ్రామాల్లో కేవలం 15 గ్రామాలకు మాత్రమే సాగునీరు పంపిణీ చేశారు కానీ, మిగిలిన 25 గ్రామాలకు మొండిచేయి చూపించారన్నదే రైతుల వేదన. సంగం బ్యారేజీ వద్దకు 3 వందల క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నా, ఆమంచర్ల వద్దకు వచ్చేసరికి 50 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందని, ఈ నీటిలో కనీసం 5 క్యూసెక్కులవంతునైనా చెరువులకు కేటాయిస్తే ఈ ప్రాంతంలో తాగునీటికి, పశువుల దాహార్తి తీరేందుకు ఉపయోగపడతాయని రైతుల సూచన. అయినా పట్టించుకునే నాథులే లేరని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కచెరువుపాడు, అంబాపురం, ఓగూరుపాడు, బుజబుజనెల్లూరు, కల్లూరుపల్లి, కంటేపల్లి, కాకుటూరు, తిప్పవరప్పాడు, రామదాసుకండ్రిగ, గురివిందపూడి, వెంకటాచలం, అనపల్లిపాడు, ఇడంపల్లి, కసుమూరు, చౌటపాళెం, కురిచెర్లపాడు, ముద్దుమూడి, చెరుకుమూడి, వడ్డపూడి, గొల్లపాళెం, బండేపల్లి, మడమనూరు, వీరంపల్లి, జట్లకొండూరు తదితర గ్రామాలన్నీ సాగునీటికొరతతో అల్లాడుతున్నాయి. ఈ గ్రామాల్లో పైర్లు వేసుకున్నవారు ఆ పొలాలు ఎండిపోగా చివరికి మూగజీవాలకు మేత కూడా కరువైపోయిందని, పరిస్థితి ఇంత దయనీయంగా వున్నా ప్రభుత్వం కరుణించకపోవడం దారుణమని రైతన్నలు కంటతడిపెడుతున్నారు. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులైనా ఈ ప్రాంతాలను స్వయంగా పరిశీలించి సాగునీటి పంపిణీకి తక్షణం చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నష్టాల పాలైవున్న తమను ఆదుకునేందుకు తగు సాయం అందించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

## అన్నదాతలను వెంటనే ఆదుకోవాలి

**- కొరపాటి మురళీనాయుడు**



కనుపూరు కాలువ ఆయకట్టు కింద సాగునీరు లేక అవస్థలు పడుతున్న 25గ్రామాల రైతాంగాన్ని వెంటనే ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొరపాటి మురళీనాయుడు కోరుతున్నారు. గత ఏడాది నకిలీ విత్తనాల బారిన పడి ఈ ప్రాంత రైతులు బాగా నష్టపోయారని, ఈ ఏడాది వర్షాభావంతో పంటలు పండక అన్నదాతలు అల్లాడిపోతున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే పంటల కోసం రైతులు ఎంతో వ్యయప్రయాసలకు గురైనారని, ఎంతో ఖర్చుపెట్టి దుక్కులు దున్నుకుని పంటలు వేసుకున్నా చివరికి సాగునీరు లేక పంటలు పోగొట్టుకున్నారని, ఇప్పుడు కనీసం మూగజీవాలకు మేత, తాగునీటికి కూడా కరువొచ్చి పడిందని, ఈ స్థితిలో అన్నదాతలను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

# శివారు కాలనీలపై ప్రత్యేకదృష్టి

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 22వ తేదీన నెల్లూరు 32వ డివిజన్ పరిధిలోని గాదం రోశయ్యనగర్, రామకోటయ్యనగర్, రాజారామిరెడ్డి నగర్‌లలో ప్రజాబాట నిర్వహించారు. ఇక్కడ ఎన్‌సిసి గ్రౌండ్స్‌లో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వలసవచ్చిన ప్రజలు ఈ శివారు కాలనీలలో నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్నారని, వారి వల్లనే కాలనీలు వేగవంతంగా విస్తరిస్తున్నాయని అయినా ఈ ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కాలనీల అభివృద్ధికి ప్రస్తుతం నగర కార్పొరేషన్ కేటాయించిన నిధులు సరిపోవని, శివారు కాలనీలలో కనీస వసతుల కల్పన కోసం 'శివారు కాలనీల అభివృద్ధి నిధిని' ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కోటంరెడ్డి పేర్కొన్నారు.

# నేదురుమల్లి జయంతి ఉత్సవాలు



రక్తదానం చేస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 82వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి స్వర్గీయ జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జన్మదినానికి గుర్తుగా ప్రతి సంవత్సరం రక్తదాన కార్యక్రమంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో నెల్లూరు ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి బృందం, రెడ్‌క్రాస్ సొసైటి కో-ఆర్డినేటర్ భాస్కరరావు సిబ్బంది, గూడూరు ఏరియా ఆసుపత్రి నుంచి డా॥ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో రాంకుమార్‌రెడ్డి అభిమానులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని 421 యూనిట్ల రక్తాన్ని 3 ఆసుపత్రులకు అందజేశారు. ఎన్‌బికెఆర్ ఐయస్‌టి డైరెక్టర్ డా॥ విజయకుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా॥ రాజగోపాల్‌రెడ్డి, మేనేజర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళంకితుడు... కాకాణి

**- మండిపడ్డ సోమిరెడ్డి**




వైకాపా నాయకుడు, సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా రాజకీయాలకు కళంకం తెచ్చాడని, ఒక ఎమ్మెల్యేగా.. ప్రతిపక్షపార్టీ నాయకుడిగా వుంటూ ఆరు కేసుల్లో ముద్దాయిగా పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతుండడం హేయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తన ప్రతిష్టను దిగజార్చేందుకు కుయుక్తులు పన్నిన కాకాణి తాను తవ్వుకున్న గోతిలోనే పడ్డాడన్నారు. ఒక ఎమ్మెల్యే రౌడీషీటర్‌లాగా 38 రోజులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి సంతకం పెట్టడం జిల్లా రాజకీయ చరిత్రలోనే లేదని, ఒక ప్రజాప్రతినిధి ఇంతగా దిగజారిపోవడం దారుణమని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి గొప్ప నాయకులు పుట్టిన ఈ జిల్లాలో ఒక ప్రజాప్రతినిధిగా కాకాణి తీరని కళంకం తెచ్చాడంటూ సోమిరెడ్డి మండిపడ్డారు. అందుకు కాకాణి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కాకాణి అప్పీల్‌ను హైకోర్టు తిరస్కరించి, లొంగిపోవాలని చెప్పినా ఆయన తప్పించుకు తిరుగుతున్నాడని, ముత్తుకూరు, తోటపల్లిగూడూరుల్లో వచ్చిన కంపెనీలతో కాకాణి, ఆయన మనుషులు కలిసి కుమ్మక్కై నిరుపేదల పొట్టలు కొట్టారని, ఆ కంపెనీలను, ఆయన అనుచరుల అక్రమాలను కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సోమిరెడ్డి ఈ సందర్భంగా ఆగ్రహంతో అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మునుకూరు రవికుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మెన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

రాజకీయాల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందో వూహించలేం. అందులోనూ ముఖ్యమంత్రి పీఠం వంటి ప్రతిష్టాత్మక పీఠాలను ఆశించే సందర్భంలో జరిగే రాజకీయాలు మరెంత రంజుగా వుంటాయో చెప్పాల్సిన పనేలేదు. అయితే రాజకీయాల్లో కూడా అదృష్టం.. దురదృష్టాల పాత్రను ఒక్కోసారి కాదనలేం. తలపండినోళ్ళంతా కలసినా, ఎవరెంతగా రాజకీయాలు చేసినా, చివరికి వచ్చేసరికి అనుకున్నదొకటి.. జరిగేది మరొకటి అన్నట్లుగా పరిస్థితి తారుమారై పోతుంటుంది. తీరా సీటు మనదే అనుకుంటున్న సమయంలో కొందరిని దురదృష్టం వెంటాడుతుంటుంది..మరెవరినో అదృష్టం వరిస్తుంటుంది. తమిళనాడులో మొన్నటికి మొన్న దాదాపు జరిగిందిదే.

'అమ్మ' మరణంతో అన్నాడిఎంకె సంక్షోభంలో పడిపోయింది. అక్రమాస్తుల కేసులో శశికళ జైలుకు పోవాల్సిరావడం, అప్పటికప్పుడు పళనిస్వామిని శశి రంగంలోకి దింపడం, ఆమేరకు ఆయన బలనిరూపణకు సిద్ధం కావడం, అత్యధిక మెజార్టీతో విజయం సాధించి సిఎం పీఠం అధిష్టించడం..అన్నీ కొద్దిరోజుల్లోనే చకచకా జరిగిపోయాయి. ఇవన్నీ కూడా వూహించని పరిణామాలే. సెగలు పొగలతో, ముష్టియుద్ధాలతో అసెంబ్లీ జరిగినా, ఎట్టకేలకు ఎడప్పాడి పళనిస్వామి విజయం సాధించి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించారంటే.. ఆయనకు అనూహ్యంగా అదృష్టం కలసిరాబట్టే. ఏదేమైనా పళనికి పట్టాభిషేకం జరగడంతో గత కొద్దిరోజులుగా తమిళనాడులో కొనసాగుతున్న రాజకీయ అనిశ్చిత పరిస్థితికి దాదాపు తెర పడినట్లే. 30 మంది మంత్రుల్లోనూ ఒకే ఒక్కరు మినహా, మిగిలినవారంతా పాతవారే కావడం, వారంతా ఇటీవల దాకా వున్న జయలలిత మంత్రివర్గంలోని వారే కావడం పళనిస్వామికి కలిసివచ్చే పరిణామమేనని అనుకోవచ్చు.

శాసనసభలో విశ్వాస పరీక్షలో నిలచి గెలిచి అత్యధికశాతం మంది ఎమ్మెల్యేలు తనవైపే వున్నారని పళనిస్వామి నిరూపించుకోవడం ఒక ఎత్తైతే, ఈ సందర్భంగా అసెంబ్లీ రణరంగంగా మారడం ఎంతైనా దురదృష్టకరం. డిఎంకె ఆందోళనలు, స్పీకర్‌పై దాడి తదితర సంఘటనలతో సభ హోరెత్తింది. ఈ సందర్భంలో, 88 మంది ఎమ్మెల్యేలున్న డిఎంకె నాయకుడు స్టాలిన్ అనూహ్యంగా రహస్య ఓటింగ్‌కు పట్టుబట్టారంటే ప్రత్యర్థి పార్టీ అయిన అన్నాడిఎంకెని ఇరుకున పెట్టేందుకేనని వేరే చెప్పనక్కర లేదు. ఆ తర్వాత జరిగిన గొడవలతో సభంతా రసాభాస కావడం, అసెంబ్లీలో జరిగిన బలపరీక్ష అధికార అన్నాడిఎంకెకి అనుకూలంగా, అక్రమపద్ధతిలో జరిగిందని ఆరోపిస్తూ ఆ బలపరీక్షను రద్దుచేయాలంటూ స్టాలిన్ ఆందోళనలకు దిగడం తెలిసిందే.

ఏదేమైనా, జయలలిత మరణంతో 'అమ్మ' స్థానం తనకే లభిస్తుందనుకున్న పన్నీర్‌కు చివరికి కన్నీరే మిగిలింది. పన్నీర్ సిఎం కావచ్చనే నమ్మకంతో బిజెపి తెరవెనుక రాజకీయాలు సాగించినా 'కమలం'కు నిరాశే తొడైంది. అమ్మ ఆశీస్సులు తనకే వున్నాయంటూ ధీమాతో రాజకీయం చేసిన శశికళకు కోర్టు తీర్పుతో చుక్కెదురైంది. దీంతో శశి కలలపై నీళ్ళు కమ్ముకున్నట్లయింది. చివరి క్షణంలో శశికళ ఆశీస్సులతో రంగంలోకి దిగిన పళనిస్వామికి పట్టాభిషేకం దక్కింది. శశికళ శిబిరంలో అనేకమంది ఎమ్మెల్యేలు నిర్బంధంలో వున్నారని, వారిని విడిపిస్తే తానే గెలుస్తానని ధీమాగా పలికిన పన్నీర్‌సెల్వంకు కేంద్రప్రభుత్వం అండదండలు దండిగా వున్నా చివరికి వైఫల్యమే లభించింది. 122 మంది పళనిస్వామికి అనుకూలంగా, పన్నీర్‌వర్గీయులు కేవలం 11 మంది మాత్రమే వ్యతిరేకంగా ఓటువేయడంతో, పళనిస్వామికే విజయం దక్కింది. జైలుకు వెళ్తూ కూడా.. ప్రత్యర్థులపై పగ సాధిస్తానంటూ చేసిన చిన్నమ్మ శపథం నెరవేరినట్లయింది.

ఇదిలావుంటే, ప్రజలకోసం అన్నాడిఎంకె పార్టీని ఏర్పాటుచేసిన ఎంజిఆర్, జయలలిత కన్న కలలను సాకారం చేయడమే తన లక్ష్యమని, మళ్ళీ అమ్మపాలన రావడం సంతోషంగా వుందంటూ సిఎం పళనిస్వామి తనదైనశైలిలో ముందుకు సాగుతుండడం మంచిదే. తమిళ ప్రజలు కోరుకుంటున్నది ఇదే. అందుకే ఆయన అమ్మ మాదిరిగానే జనాకర్షక పథకాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో జయలలిత ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సంకల్పించారు.

'అమ్మ టూ వీలర్ పథకాన్ని' ప్రారంభిస్తూ తొలి ఫైలుపై సంతకం చేశారు. స్కూటీ కొనుగోలుచేసే మహిళలకు 50 శాతం రాయితీ లేదా ఒకేసారి 20వేలు ఇవ్వనున్నారు. గర్భిణులకు ఇస్తున్న సాయాన్ని 12 నుంచి 18వేలకు పెంచాలని నిర్ణయించారు. ఇళ్ళులేని 5వేల మంది జాలర్లకు ఇళ్ళు కట్టించి ఇవ్వాలని, నిరుద్యోగ యువతకు ఇస్తున్న నిరుద్యోగభృతిని రెట్టింపు చేయాలని నిర్ణయించారు. అంచెలంచెలుగా మద్య నిషేధానికి ఆదేశాలిచ్చారు. జనరంజక పాలనతో తమిళనాడు ప్రజల మనసుల్లో నిలచిపోయేవిధంగా పథకాలకు రూపుదిద్దుతున్నారు.

అయితే ఇక్కడ కొన్ని ధర్మసందేహాలున్నాయి. ఇప్పుడు గెలుపు సాధించినంత మాత్రాన పళనిస్వామి ప్రభుత్వం సుస్థిరంగానే వుంటుందా?.. ఎమ్మెల్యేలను చివరిదాకా ఆయన తనవైపే వుండేలా చూసుకోగలడా?...డిఎంకె సెగను తట్టుకోగలడా?.. రానున్న స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికల్లో రాణించగలడా?..ఇలాంటి అంశాలన్నీ ఇప్పుడు తమిళనాడులో చర్చనీయాంశంగా వున్నాయి. అయినా, కాలమే ఇలాంటివాటికి పరిష్కారాలు చెప్పాలి.

భవిష్యత్తులోనూ ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సిఎంగా పళనిస్వామి ముందుజాగ్రత్తతో నిబ్బరంగా ప్రజాపాలనకు బాటలు వేసుకోవడం ఒక్కటే ఇప్పుడున్న తరుణోపాయం. రచ్చలు రావిళ్ళతో ఇంతకాలం కాగిపోయిన తమిళనాడుకు ఇక కావాల్సింది ప్రజాపాలన. అదికూడా జనరంజకమైన పాలన. ప్రజల ఆశలు.. ఆకాంక్షలకు తగ్గట్టుగా ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రజాభ్యున్నతికి బాటలువేస్తూ పారదర్శకమైన.. సుపరిపాలనను అందించ గలిగితేనే సార్థకత. లేకుంటే పరిస్థితి మళ్ళీ మొదటికే!...

### అరవ దేశంలో చిచ్చు ఆరేనా?



రాజకీయాలంటేనే చిత్రవిచిత్రమైనవి. ఎప్పుడు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో వూహించలేనివి. విధి కూడా చిత్రమైనదే. ఎప్పుడు ఎవరిని అదృష్టంగా వరిస్తుందో.. ఎవరిని విషాదయోగంలోకి నెడుతుందో తెలియదు. తమిళనాడులో మొన్నటిదాకా జరిగిన పరిణామాలన్నీ ఇలాంటి చిత్రమైనవే. ఏదేమైతేనేం.. ఈ రాజకీయ పరమపద సోపానంలో పళనిస్వామికే పట్టాభిషేకం దక్కడం..ఒకరకంగా ఆయన అదృష్టమే. ఇక చేయాల్సిందల్లా జనరంజకమైన పాలన. లేకుంటే పరిస్థితి మళ్ళీ మొదటికే!

## యువత దేశానికి వెన్నెముక

యువతే దేశానికి వెన్నెముకని నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వీరయ్య పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత 5రోజులుగా నెల్లూరు అరవిందనగర్ లోని వివేకానంద జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీలో జరుగుతున్న సమాజ అభివృద్ధి యువ నాయకత్వ శిక్షణా కార్యక్రమం ముగింపు సభకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ మనీ ట్రాన్సాక్షన్స్, కంప్యూటర్ ఇంటర్నెట్, సామాజిక విలువలు, నవభారత నిర్మాణంలో యువత బాధ్యత, మతసామరస్యం, సంస్కృతి ఇలా ఎన్నో అంశాలపై అవగాహన కలిగించడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. జిల్లా స్వచ్ఛంధ సేవా సంస్థల అధ్యక్షుడు ఈవియస్ నాయుడు, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, పినాకిని సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, వొమ్మిన నాగసతీష్‌బాబు, వి.భానుమతి, జి.కిరణ్‌కుమార్, రవి గోగులపల్లి, కరస్పాండెంట్ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు

కనీవినీ ఎరుగనివిధంగా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి విజయవంతంగా పంపి భారతదేశ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించిన ఇస్రో శాస్త్రవేత్తలకు నెల్లూరులోని భారతీయ వైజ్ఞానిక సంఘ్ జేజేలు పలికింది. ఆ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య ఆదిత్య, అధ్యక్షుడు దేగా రామచంద్రారెడ్డి, కె. రమణయ్య, కె.వెంకటరెడ్డి, పి.వేణుగోపాలరెడ్డి తదితరులు ఒక ప్రకటనలో ఇస్రో శాస్త్రవేత్తలకు తమ అభినందనలు తెలిపారు. ఏ దేశం ప్రయోగించని విధంగా, స్వదేశీ పరిజ్ఞానంతో వినూత్న తరహాలో అగ్రదేశాలను సైతం అధిగమిస్తూ ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను దిగ్విజయంగా పంపడం ఎంతైనా అద్భుతమన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ర్యాలీ నిర్వహించి శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. ఈ శుభసందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు చదలవాడ రమణయ్య, నాగిరెడ్డి, మధు, మహిధర్, అనూష, అంకయ్య, శ్రీనివాసులు, పవన్, కవిత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.




### చరిత్రహీనులౌతారు

ప్రత్యేకహోదాతో ప్రయోజనాలు లేవని చెప్పి రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడులు చరిత్రహీనులుగా నిలిచిపోవడం ఖాయం. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు వీళ్లిద్దరూ తీరని ద్రోహం చేస్తున్నారు. ప్రత్యేకహోదాతో ప్రయోజనాలు వీళ్లకు తెలియవా? ప్రయోజనాల గురించి తెలియకుండానే అంతకుముందు ప్రత్యేకహోదా కావాలని అడిగారా? వీరి నాటకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. సమయం వచ్చినప్పుడు బుద్ధి చెబుతారు.

**ఉయ్యూరు రామస్వామి, చీరాల.**

### మంత్రి పదవికి అర్హుడు సోమిరెడ్డి

మంత్రి పదవికి అన్ని విధాలా అర్హుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఒంటిఊపిరి మనిషి. కొండ మిరపకాయలాంటోడు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకాణిని నిద్రపోనీయడం లేదు. తనకు ఎన్ని ఇబ్బందులెదురైనా తెలుగుదేశాన్ని విడిచిపెట్టలేదు. జగన్‌ను నసాళం అంటే దాకా తలంటుతున్నాడు. సర్వేపల్లిలోనే కాదు జిల్లాలోనే ప్రతి ఊరు, ప్రతి ఊరి నాయకుడు తెలిసిన మనిషి. పిట్ట కొంచెమైనా, కూత ఘనమన్నట్లు పార్టీని నిలబెట్టగల సమర్థుడు. మంత్రి పదవి ఆయనకే ఇవ్వాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

### లెక్క బయటపెట్టరేమీ?

పెద్దనోట్ల రద్దు తర్వాత పెద్దపెద్ద ప్రయోజనాలుంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. ఆ ప్రయోజనాలేవో ఇంతవరకు చెప్పలేదు. బడ్జెట్‌లో ఏమన్నా ప్రోత్సాహముంటుందా అంటే అదీ లేదు. ప్రయోజనాల సంగతి పక్కనపెడితే ఇంతవరకు బ్యాంకులకు చేరిన పెద్దనోట్ల విలువ ఎంత? బయటపడ్డ నల్లధనమెంత? అనే వివరాలు కూడా బయటపెట్టడం లేదు. కాని పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**పబ్బిశెట్టి కామేశ్వరరావు, నెల్లూరు.**

### మనకేల... అరవగోల

తమిళనాడులో రాజకీయ సంక్షోభం మనదైనట్లు, అక్కడ నెలకొన్న రాజకీయ పరిస్థితులను 24గంటలు లైవ్‌షోల ద్వారా చూపించిన తెలుగు టీవీ ఛానెళ్లను ఏమనాలో అర్థంకావడం లేదు. మన రాష్ట్రంలో సమస్యలే లేనట్లు 24గంటలూ అరవగోలను చూపించారు. అక్కడ ఎవరు ముఖ్యమంత్రి అయితే ఏంటి, ఏ ప్రభుత్వం ఏర్పడితే మనకేంటి? మన రాష్ట్రంలో బోలెడన్ని సమస్యలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి, దోపిడీకి లైసెన్సులు ఇచ్చినట్లుగా వ్యవహరిస్తోంది. దమ్ముంటే అవి చూపించండి. వీలైతే చంద్రబాబుకు చెక్కభజన... లేదంటే అరవగోల... ఇదే మన తెలుగు మీడియా తీరు! తమిళనాడు రాజకీయ వ్యవహారాలలో మన మీడియా వ్యవహరించిన తీరు మరీ అతిగా వుంది.

**ఎస్.నాగమునిరెడ్డి, తడ.**

# గెలుపు కోసం పరుగు

**మండలి ఎన్నికల తేదీ దగ్గరకొచ్చే కొద్ది రాజకీయ వేడి పెరుగుతోంది. తూర్పు రాయలసీమ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో పలువురు అభ్యర్థులు రంగంలో ఉన్నప్పటికీ ప్రధానపోటీ తెలుగుదేశం, యూటిఎఫ్‌ల మధ్యే నెలకొనివుంది.**






యూటిఎఫ్ తమ అభ్యర్థులుగా గత ఎన్నికల్లో గెలిచిన యండపల్లి శ్రీనివాసులురెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యంలను ఖరారు చేయడం తెలిసిందే! తెలుగుదేశం నుండి పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా మంత్రి నారాయణ ముఖ్యఅనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని చాలా ముందే నిర్ణయించారు. కాని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికను నాన్చారు. మాజీమంత్రి పరసా రత్నంతో పాటు టిటిడి ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి సతీమణి శ్రీమతి సుచరిత, చిత్తూరుజిల్లాకు చెందిన వాసుదేవనాయుడు ఈ సీటు కోసం ప్రయత్నించారు. మిత్రధర్మంగా ఈ సీటును తమకివ్వాలని బీజేపీ కూడా కోరింది. అయితే చివరకు చిత్తూరుజిల్లాకు చెందిన వాసుదేవనాయుడునే అభ్యర్థిగా నిర్ణయించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి కూడా రంగంలో వున్నారు. ఇక రెండు నియోజకవర్గాలలోనూ ఆయా సంఘాల తరపున ఇండిపెండెంట్‌లుగా కొందరు రంగంలో వున్నారు. రాష్ట్ర రాజకీయాలలో ప్రతిపక్షంగా వున్న వైకాపా ఈ రెండు నియోజకవర్గాలలో అభ్యర్థులను పెట్టకుండా వామపక్ష అభ్యర్థులకు తమ మద్దతు ప్రకటించింది.

రాష్ట్ర శాసనమండలి ఏర్పాటైన తర్వాత ఇంతవరకు రెండుసార్లు తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే రెండుసార్లు కూడా ఈ రెండు నియోజకవర్గాలలో యూటిఎఫ్ అభ్యర్థులే గెలిచారు. మరి ఈసారి హ్యాట్రిక్ మీద దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఉపాధ్యాయ నియోజకవర్గంలో యూటిఎఫ్ తిరుగులేని ఆధిపత్యం చూపుతోంది. ఉపాధ్యాయుల ఎన్నికల్లో వాళ్ళను అధిగమించడం మిగతావాళ్లకు కష్టమే! అదీగాక తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాసుదేవనాయుడు కంటే అభ్యర్థి పరంగా యూటిఎఫ్ నుండి పోటీ చేస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎంతో బెటర్. రెండుసార్లు ఎమ్మెల్సీగా చేసాడు. ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గళమెత్తాడు. బయట కూడా పోరాడాడు. ఇక ఆయా ఉపాధ్యాయ సంఘాల మధ్య ఓట్లు చీలే అవకాశాలున్నాయి. ఉపాధ్యాయ నియోజకవర్గంలో యూటిఎఫ్‌ను నిలువరించడం కష్టమే!

పట్టభద్రుల నియోజకవర్గంపై తెలుగుదేశం గంపెడాశలు పెట్టుకుంది. వారి ఆశల్లా కొత్తఓట్లు అధికసంఖ్యలో చేర్పించామని. యూటిఎఫ్ ఓట్లు ఇక్కడ బలంగానే వున్నాయి. కాకపోతే కొత్తగా చేరిన ఓటర్లు ఎవరువైపు మొగ్గుచూపుతారన్నది చూడాలి. ఇక అభ్యర్థుల పరంగా చూసినా యూటిఎఫ్ అభ్యర్థి యండపల్లి శ్రీనివాసులు రెడ్డికి మంచి పేరుంది. గత ఎన్నికల్లోనూ ఆయనే గెలిచాడు. యూటిఎఫ్ నుండే కాక విద్యావంతులైన పట్టభద్రుల మొదటి ఛాయిస్ కూడా ఆయనే ఉంటాడు. తెలుగుదేశంకు అభ్యర్థి ప్రధాన మైనస్. వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అభ్యర్థిత్వం పట్ల తెలుగుదేశంలోనే వ్యతిరేకత వుంది. పార్టీలో అందరు నాయకులు ఆయనకు పూర్తిగా సహకరించే పరిస్థితి లేదు. మిగిలిన అభ్యర్థులు రంగంలో వున్నా నామమాత్రపు పోటీనే ఇవ్వగలరు. ప్రధాన పోటీ వుండేది టిడిపి, యూటిఎఫ్‌ల మధ్యే!



## ఛైర్మెన్ వద్దు...
# మంత్రే ముద్దు

త్వరలో మంత్రివర్గ విస్తరణ ఖాయమనుకుంటున్న పరిస్థితుల్లో నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. పార్టీలోనూ సోమిరెడ్డికి మద్దతు పెరుగుతోంది. సోమిరెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోకూడదు అని అడ్డు చెప్పడానికి బలమైన కారణాలేవీ లేవు. ఆయన పార్టీకి వెన్నుపోట్లు పొడవలేదు. పార్టీ రాజకీయాలను బజారున పెట్టలేదు. పార్టీలోని కొందరు నాయకులతో అంతర్గత విభేదాలున్నా ఏరోజూ వారిని రాజకీయంగా గాని వ్యక్తిగతంగా గాని పల్లెత్తుమాట అనలేదు. కేవలం తన పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా రాజకీయాలు మాత్రమే చేస్తున్నాడు. పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లయినా, అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో అయినా క్రమశిక్షణగల పార్టీ సైనికుడిలా పనిచేసాడే గాని పార్టీ అధిష్టానం గీసిన గీతను దాటి ప్రవర్తించలేదు. కాబట్టే సోమిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే సానుకూల వైఖరి పార్టీలో ఎక్కువగా కనిపిస్తోంది. ఇక నెల్లూరు వంటి 'రెడ్ల' ప్రాధాన్యత వున్న జిల్లాలో ఆ సామాజిక వర్గానికి చెందిన సోమిరెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకోవడం అన్ని విధాలా బెటర్! గత 30ఏళ్ల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే నెల్లూరుజిల్లా నుండి 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన మంత్రి లేకపోవడం ఇప్పటి ప్రభుత్వంలోనే జరిగింది.

ఒక దశలో శాసనమండలి ఛైర్మెన్‌గా సోమిరెడ్డిని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. త్వరలో శాసనమండలి ఛైర్మెన్‌గా చక్రపాణి రెటైర్డ్ కానున్నారు. ఆయన స్థానంలో సోమిరెడ్డిని పంపిస్తే, నెల్లూరుజిల్లాలో మంత్రిగా వున్న నారాయణకు ఇబ్బంది లేకుండా ఉంటుందనుకున్నారు. కాని సోమిరెడ్డికి శాసనమండలి ఛైర్మెన్ పదవి ఇవ్వడమంటే నోటికి ప్లాస్టర్ వేసి ఒక గదిలో బంధించడమే! తిట్టే నోరు తిరిగే కాలు వూరికే ఉండాలంటే కష్టం కదా! మండలి ఛైర్మెన్ కుర్చీలో కుర్చుంటే జగన్‌ను తిట్టలేడు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయలేడు. చాలా పద్ధతిగా ఉండాల్సి ఉంటుంది. ఆ బాధంతా ఎందుకనే ఉద్దేశ్యంతోనే ఆయన మండలి ఛైర్మెన్ వద్దు, ఇస్తే గిస్తే ఆ మంత్రి పదవినే చూడమని చంద్రబాబును కోరినట్లు తెలుస్తోంది.

## ఇంత...
# చెత్త కార్పొరేషన్ ఎక్కడా లేదు!



నెల్లూరు కార్పొరేషన్ అంతటి చెత్త కార్పొరేషన్ దేశంలోనే ఎక్కడా ఉండదని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఈ నెల 20వ తేదీన అనిల్ 13వ డివిజన్‌లోని దేవీ ప్యారడైజ్ ఏరియా, బ్యాంకు కాలనీలలో పర్యటించారు. ఇక్కడ రెండు నెలల క్రితం డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టారు. సగం చేసి సగం వదిలేసారు. ఈ పనిని చూసిన అనిల్‌కు చిర్రెత్తుకొచ్చింది. కార్పొరేషన్ పనితీరు ఎంత నికృష్టంగా ఉందనేందుకు దీనినొక ఉదాహరణగా చూపించారాయన. ఈ ప్రాంతంలో పదికిపైగా అపార్ట్‌మెంట్లున్నాయి. పెద్ద సంఖ్యలో ప్రజలుంటున్నారు. ఈ కాలువపై రెండు కల్వర్ట్‌ల నిర్మాణం పూర్తి చేస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. అవి పూర్తికాకపోవడంతో స్థానికులు చుట్టూ తిరిగి పోవాల్సి వస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే ఈ పనులనన్నా పూర్తి చేయించాలి, లేదంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో అయినా పెట్టాలని అనిల్ డిమాండ్ చేశారు. మన కార్పొరేషన్ పాలకులు, అధికారుల చేతకానితనం వల్లే నెల్లూరుకు మంజూరైన 60కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను గుంటూరు జిల్లాకు తరలించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కొండారెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఊటుకూరు నాగార్జున, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నక్కా శీనయ్య, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాతనోట్లు 50లక్షలు పట్టారు



వెయ్యి, 500నోట్లు రద్దు చేయడం, వాటి చెలామణి గుడువు ముగియడం తెలిసిందే! డిసెంబర్ 30వ తేదీతో చెలామణి ముగిసింది. ఆ తర్వాత కూడా ఆ నోట్లు ఏవన్నా మిగిలివుంటే మార్చి నెలాఖరులోపు ఆర్‌బిఐ వద్ద జమచేయొచ్చని కేంద్రం పేర్కొనడం తెలిసిందే! అలా జమ చేసే పాతనోట్లకు లెక్క పక్కాగా ఉండాలని కూడా తేల్చి చెప్పారు. కాగా, మొన్న తెచ్చిన బడ్జెట్‌లో మాత్రం పాతనోట్లు పట్టుబడితే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు దొరికిన నగదుకు సమానంగా జరిమానా విధిస్తామని ప్రకటించారు. కాగా, 19వ తేదీ సాయంత్రం నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని కింగ్స్ కోర్టు అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాటులో 50లక్షల రూపాయల పాత నోట్లను పోలీసులు పట్టుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వేమూరి శ్రీహరిరెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. శ్రీహరిరెడ్డి తన వద్ద వున్న పాత వెయ్యి నోట్లు 50లక్షల రూపాయలను మార్చుకునేందుకు తనకు పరిచయమున్న నెల్లూరు మన్సూర్‌నగర్‌కు చెందిన కొత్తూరు శ్రీనివాస్, నరసింహకొండకు చెందిన కుర్రా శ్రీకాంత్‌రెడ్డిల సాయం కోరాడు. వాళ్ళు 25శాతం మార్జిన్‌తో మార్చిస్తామని చెప్పారు. ఈమేరకు 19వ తేదీ సాయంత్రం ముగ్గురు శ్రీహరిరెడ్డి ఫ్లాటులో సమావేశమయ్యారు. ఈ సమాచారం అందడంతో నెల్లూరు 4వ నగర సి.ఐ సీతారామయ్య తన సిబ్బందితో కలిసి ఫ్లాటుపై దాడిచేసి 50లక్షలు స్వాధీనం చేసుకున్నారు.




# నెల్లూరు కబుర్లు

## అమెరికా వెళ్లిన విశాల్



- త్రివిక్రమ్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు

నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ అమెరికాకు వెళ్లారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై మరింత అవగాహన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక బృందాన్ని అమెరికాకు పంపింది. 6మంది గల ఈ బృందంలో మన ఎస్పీ విశాల్‌గున్నీ కూడా ఉన్నారు. మన విశాల్‌కు సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తి ఎక్కువ. నేర నియంత్రణ, ట్రాఫిక్ కంట్రోల్‌కు ఆయన టెక్నాలజీని బాగా వాడేస్తున్నారు. గతంలో జరిగిన రెండు పుష్కరాలలోనూ, ఎయిర్‌షోలోనూ, ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ తిరుమల తిరుపతి పర్యటనలోనూ విశాల్‌కు టెక్నాలజీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలే అప్పగించారు. టెక్నాలజీలో ఆయన టాలెంట్‌ను గుర్తించే ఈ టీమ్‌కు ఎంపిక చేశారు. అమెరికాలో వారంరోజులపాటు వారికి శిక్షణ, అవగాహన ప్రోగ్రామ్ ఉంటుంది. విశాల్ తిరిగొచ్చే వరకు ప్రకాశం జిల్లా ఎస్పీ త్రివిక్రమ్‌వర్మనే నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీగా వ్యవహరించనున్నారు.

### శ్రీ రాజేశ్వరమ్మ ఆలయ పూజారి

## తంగిరాల షష్టిపూర్తి



నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంకు వెళితే మనకు అమ్మవారి దర్శనం కంటే ముందు చిరునవ్వుతో కనిపించే అయ్యవారు దర్శనమిస్తారు. ఆయనే తంగిరాల రాధాకృష్ణశర్మ! నెల్లూరు ప్రజలకు రాజేశ్వరమ్మ మీద ఎంత భక్తి భావముందో, అలాగే నిత్యం ఆమె సేవలో తరించే సీనియర్ పూజారి రాధాకృష్ణశర్మ పట్ల కూడా ప్రతి ఒక్కరికీ నమ్మకం, గురుభావం ఉంటుంది. అలాంటి వేదపండితులు రాధాకృష్ణశర్మ దంపతులకు షష్టిపూర్తి వేడుకలను 20వ తేదీ నెల్లూరు వేదాయపాలెంలోని యంవియస్ కళ్యాణ మండపంలో అభిమానుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరులకు హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు రాధాకృష్ణ శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. అలాగే మాజీ కార్పొరేటర్ సన్నపరెడ్డి పెంచలరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు దొడ్డపనేని రాజానాయుడు, మేకల రజని, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్ రత్నం జయరామ్, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీఛైర్మెన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి దంపతులు పాల్గొని శర్మ దంపతులను సత్కరించారు.

## మాడరన్ స్కూల్లో ఫ్రీ మార్కెట్




నెల్లూరు సరస్వతీనగర్‌లోని మోడరన్ స్కూల్లో ఆదివారం ఫ్రీ మార్కెట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి ఇళ్ళలో అవసరం లేని టీవీలు, వాటర్ ప్యూరిఫయ్యర్లు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, సోఫా సెట్లు, డివిడి ప్లేయర్లు తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, యం.వి.సుబ్బారెడ్డి, శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కవులకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారం

శ్రీకృష్ణ దేవరాయ వార్షికోత్సవాల సందర్భంగా నెల్లూరుకు చెందిన ఇద్దరు పద్యకవులు రాయలు పురస్కారాలు అందుకున్నారు. శ్రీకాకుళంలో రాయలు వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపి శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా పద్యకవులు బిరదవోలు రామిరెడ్డి, ఆలూరు శిరోమణిశర్మ ఈ పురస్కారాలు అందుకున్నారు. పద్యకవితా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో జరిగిన కార్యక్రమాల్లో నగదు పురస్కారాలతో వీరిని ఘనంగా సత్కరించారు.

# ప్రైవేటు వైద్యులపై వేటు

ప్రభుత్వ విధుల్లో ఉంటూ ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయాల్సిన వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీసులలో మునిగి తేలుతుంటారు. ప్రభుత్వ వైద్యశాలలో మొక్కుబడిగాను, తమ సొంత క్లినిక్‌లలో చిత్తశుద్ధితోనూ రోగులను చూస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నంతసేపు కూడా వీరి మనసు తమ సొంత క్లినిక్‌లలో ఎంతమంది పేషంట్లు వచ్చి వెయిట్ చేస్తున్నారన్న దానిమీదే ఉంటుంది. అంతేగాని గవర్నమెంట్ ఆసుపత్రిలో గంటలకొద్ది నిలబడి వున్న రోగుల గురించి ఆలోచించరు.



ఆకస్మిక తనిఖీల్లో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

ప్రభుత్వ వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తున్న డాక్టర్లకు తగిన శాస్తి జరిగింది. ఆరుగురు వైద్యులపై సస్పెండ్ వేటు పడింది. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ విషయమై స్పందించి ఉత్తర్వులు పంపారు కూడా!

ముఖ్యమంత్రి వచ్చి చెప్పాడు... మంత్రులు వచ్చి చూసారు... కలెక్టర్లు ఎన్నిసార్లు కన్నెర్ర జేసారు. ఆరోగ్యశాఖ మంత్రి అయితే ఇక్కడ నిద్రపోతే ఇక్కడున్న దరిద్రానికి రోగం గ్యారంటీ అన్న పరిస్థితి ఉన్నా కూడా ఇక్కడ నిద్ర చేశారు. ఇక్కడ వైద్యులను, సిబ్బందిని మారండి, మారండి అని మొత్తుకున్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్నారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని మొత్తుకున్నారు. అయినా వింటారా... వస్తుంటారు, చెబుతుంటారు, పోతుంటారులే అన్న నిర్లక్ష్యం! ఎప్పుడూ రోజులు ఒకేలా ఉంటాయా? ఒకరు కాకపోతే ఒకరన్నా సిన్సియర్‌గా పనిచేసే కలెక్టర్ రాడా... వీళ్ళ బండారాన్ని బయటపెట్టడా?

ఇప్పుడదే జరిగింది. నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో పని చేస్తున్న వైద్యులపై కలెక్టర్ ముత్యాలరాజు నిఘాపెట్టారు. ఆసుపత్రికి వైద్యులు సకాలంలో రావడం లేదని, వచ్చిన వాళ్ళు కూడా బయోమెట్రిక్ మిషన్‌లో వేలు పెట్టి వెళ్ళిపోతున్నారని తేలింది. మళ్ళీ సాయంత్రం ఇంకోసారి ఆసుపత్రికొచ్చి ఆ మిషన్‌లో వేలుపెడితే రోజంతా డ్యూటీ చేసినట్లు లెక్క అనుకున్నారు. డాక్టర్లు బయోమెట్రిక్‌ను మోసం చేయగలిగారుగాని, సి.సి కెమెరాల కళ్ళు గప్పలేకపోయారు. ఆసుపత్రికి వైద్యుల రాకపోకలను నిశితంగా గమనించిన కలెక్టర్ ఇక వారిని దారిలో పెట్టకతప్పదనుకున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏ ఏ డాక్టర్ ఎక్కడెక్కడ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు, లేదా సొంత క్లినిక్‌ను నడుపుతున్నాడన్న సమాచారం సేకరించారు. ఇటీవల ఒకరోజు తన సి.సిల ఫోన్‌లను కూడా స్విచ్ఛాఫ్ చేయించి ఎక్కడకుపోతున్నది వారికి కూడా తెలియకుండా నగరంలోకి వచ్చారు. ప్రభుత్వ వైద్యులు డ్యూటీలు ఎగ్గొట్టి ప్రైవేట్ క్లినిక్‌లలో సేవలందిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా ఆరుమంది వైద్యులు ఆయన కంట్లో పడ్డారు. వీరిని సస్పెండ్ చేయాలంటూ కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీరిని సస్పెండ్ చేసింది. అయితే ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రైవేటు సేవలు ఆశిస్తున్న డాక్టర్లంతా ప్రభుత్వ విధుల నుండి వైదొలగి ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుకుంటే ఏ తలనొప్పీ ఉండదు. పేదలకు సేవచేయాలన్న చిత్తశుద్ధి వున్న డాక్టర్లన్నా వీరి స్థానాల్లో వస్తారు.

### ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా

## రవి కృష్ణంరాజు

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సీటు అంటేనే దరిద్రంగా మారిపోయింది. ఈ సీట్లో హ్యాపీగా కూర్చోవాల్సిందిపోయి, భయంతో వణుకుతూ కూర్చుంటున్నారు. కమిషనర్‌గా వెంకటేశ్వర్లును బదిలీ చేసాక ఇక్కడకు ఇంకా పూర్తిస్థాయి కమిషనర్ రాలేదు. ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా వున్న బి.రామిరెడ్డి మీద ఏసిబి దాడులు జరగడంతో ఆయన ఆ పోస్ట్ నుండి తప్పుకోవడంతో మూడవ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌ను నియమించాల్సి వచ్చింది. కార్పొరేషన్ ఎస్‌ఇగా వున్న రవికృష్ణంరాజును ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా నియమిస్తూ డిఎంఎ కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

## న్యాయమూర్తుల నియామకం

నెల్లూరుజిల్లా ఫ్యామిలీ కోర్టు సెషన్స్ జడ్జిగా గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సాల్మాన్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు ఏసిబి కోర్టు జడ్జిగా విజయవాడ 1వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎండి అబ్దుల్ రఫీని నియమించింది. నెల్లూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా పనిచేస్తున్న సత్యవాణిని పదోన్నతిపై కడప జిల్లా రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## ప్రచారం మొదలెట్టిన వివేకా



తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల తెలుగుదేశం అభ్యర్థులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, వాసుదేవనాయుడుకు మద్దతుగా మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నెల్లూరులో ప్రచారం మొదలుపెట్టారు. వివిఆర్ విద్యాసంస్థలతో పాటు అన్ని డివిజన్‌లలోనూ మీటింగ్‌లు పెడుతున్నారు. ఇటీవల విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలిపించి ఆయన చేతిలో పెడతానని ధీమాగా చెప్పొచ్చాడుగా! మాట నిలబెట్టుకోవడానికేమో... కష్టపడుతున్నాడు.


### పెద్దాయన జయంతిని

## పండుగలా చేసిన కాంగ్రెస్ నేతలు



నెల్లూరుజిల్లాలో కాంగ్రెస్ పార్టీ అంటే గుర్తుకొచ్చేది మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. ఆయనొక పొలిటికల్ యూనివర్సిటీ! ఈ విశ్వవిద్యాలయంలో ఎంతోమంది నాయకులు తయారయ్యారు. అయితే ఇప్పుడు చాలామంది ఆయనను గుర్తుపెట్టుకునే పరిస్థితుల్లో కూడా లేరు. ఉన్నవారిలోనే కొద్దిమంది 20వ తేదీ ఆయన జయంతిని బాగానే జరిపారు. నెల్లూరు, ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు, పెద్దాయన విశ్వాసపాత్రుడు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఆయన జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, రఘురామ్‌ముదిరాజ్ పాల్గొని పేదమహిళలకు చీరలు పంపిణీ చేశారు.

# కార్పొరేట్ కబంధ హస్తాల్లోకి సిఏఎం



**వందేళ్లకు పైగా చరిత్ర కలిగి, లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసి, ఎందరి జీవితాలలోనో వెలుగు నింపిన నెల్లూరు, మూలాపేటలోని సిఏఎం హైస్కూల్ ఇప్పుడు తన భవిష్యత్ అర్థంకాక తనను కాపాడేవారి కోసం ఎదురుచూస్తోంది. చరిత్ర నుండి తనను మాయం చేయకముందే కాపాడుకోండని కోరుతోంది.**

నెల్లూరుజిల్లాలో క్రైస్తవ మిషనరీల ఆస్తులు అన్యాక్రాంతమవుతుండడం తెలిసిందే! అప్పటికే అమెరికన్ ఆసుపత్రిని చుట్ట చుట్టేసారు. తాజాగా సిఏఎం హైస్కూల్‌కు కూడా ఎసరుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విద్యా వ్యాపారం వల్ల ప్రభుత్వ బళ్లలో విద్యార్థుల సంఖ్య పడిపోయింది. మిషనరీ స్కూళ్ళు కూడా అలాగే తయారయ్యాయి. దీంతో విద్యార్థులు చేరక ఈ హైస్కూల్‌ను మూసేయాల్సిన పరిస్థితిని కల్పించారు. ఈ హైస్కూల్ ప్రాంగణాన్ని ఇప్పుడు రోజూ వ్యాయామాలు చేసుకోవడానికి, ఆటలు ఆడుకోవడానికి, ఎలక్షన్‌ల టైంలో పోలింగ్‌బూత్‌లు పెట్టుకోవడానికి వాడుతున్నారు. తాజాగా పరివార్ గ్రూప్ హోటల్స్ అనే సంస్థకు ఈ హైస్కూల్‌ను అతితక్కువ లీజుతో ఇచ్చేసారు. పరివార్ ప్యాలెస్ పేరుతో వాళ్లు ఇక్కడ హోటల్ వ్యాపారం మొదలుపెడతారు. హైదరాబాద్, ముంబై, మైసూరు వంటి నగరాలలో ఈ ప్యాలెస్ బిజినెస్ బ్రహ్మాండంగా జరుగుతుంది. చారిత్రాత్మక కట్టడాలలో ఈ ప్యాలెస్ హోటల్ వ్యాపారం సాగుతుంటుంది. ఇప్పుడు సిఏఎం హైస్కూల్ కూడా అటువంటి వ్యాపారానికే వేదిక కాబోతుంది. మరి ఉన్నతాధికారులు ఈ హైస్కూల్‌ను కాపాడుకోవడానికి ఏం చర్యలు తీసుకుంటారో, ఈ హైస్కూల్ పూర్వవిద్యార్థులు ఇది వ్యాపార సంస్థ చేతుల్లోకి పోకుండా ఎంతవరకు కాపాడుకుంటారో చూడాలి!

# రెయిన్‌బో గేమ్స్‌గాలా



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్లో గేమ్స్‌గాలా క్రీడోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం క్రీడా జ్యోతులను వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు రన్నింగ్‌రేస్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ అరుణాస్వయంప్రభ, రామిగిరి విద్యాసాగర్, ప్రీప్రైమరి స్కూల్ ఇన్‌ఛార్జి ఫాతిమాఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశంలోనే అత్యుత్తమ పోర్టుగా కృష్ణపట్నం పోర్టు

**- సిఇఓ అనిల్ ఎండ్లూరి**



భారతదేశంలోనే కృష్ణపట్నం పోర్టు అత్యుతమ పోర్టుగా రూపుదిద్దుకుంటుందని కృష్ణపట్నం పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి పేర్కొన్నారు. ఇటీవల కృష్ణపట్నం పోర్టు నుంచి నేరుగా సింగపూర్, మలేషియా, సౌత్‌కొరియా పాస్ట్‌ఈస్ట్ మరియు సౌత్ ఈస్ట్‌కు హుండాయ్ ప్రిస్టేజ్ – 039 నౌక ద్వారా వారాంతపు కంటైనర్ సేవలను హెచ్‌ఎంఎం మేనేజింగ్ డైరెక్టర్ వై.డి. మార్కుతో కలిసి పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని అలాగే కృష్ణపట్నంపోర్టు నుంచి చైనా, సౌత్ కొరియా, మలేషియా, సింగపూర్‌కు నేరుగా కంటైనర్ సేవలను ప్రారంభించడంతో ఎగుమతులు, దిగుమతులు మరింత పెరుగుతాయన్నారు. దీంతో ఎగుమతి, దిగుమతిదారులతోపాటు, వ్యాపారవేత్తలకు ఎంతో అనుకూలంగా ఉండడంతో పాటు తక్కువ సమయంతో పాటు ఖర్చు ఎంతగానో తగ్గుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెపిసిటి సిఓఓ జితేంద్ర, చాయిస్ మేనేజింగ్ డైరెక్టర్ జోస్‌తామస్, కెప్టెన్ మస్టిస్‌లాన్, హెచ్‌ఎంఎం ఇండియా జనరల్ మేనేజర్ జాన్సన్, కస్టమ్స్ జాయింట్ కమిషనర్ రామమోహన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కెపిసిటి అధికారులు, కృష్ణపట్నం పోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మాతృదేవోభవ



నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ

**స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ**

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)



మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
22 ఏళ్ళు నిండనున్న సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
ఆమె ఆత్మీయులైన వారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

**డా॥ టి.సుబ్బరామిరెడ్డి**
రాజ్యసభ సభ్యులు
మరియు
**వారి కుటుంబసభ్యులు**

### సమాజహితం కోరే కవి...
# నిజమైన నాయకుడు
**- డా॥ పాపినేని శివశంకర్**



సమాజహితం కోరే కవి నిజమైన నాయకుడని డా॥ పాపినేని శివశంకర్ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి, నెల్లూరుజిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 18వ తేదీ నెల్లూరు విఆర్‌సి ప్రాంగణంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేడు తెలుగు భాషని కూడా స్వచ్ఛంగా పలకలనేని వారు సాహిత్య రంగంలో హీరోలుగా చలామణి కావడం విచారకరమన్నారు. నెల్లూరుకు చెందిన తిక్కన మహాకవిని ఈనాటికీ తలచుకోవడానికి కారణం ఆయన వ్రాసిన సంస్కార సాహిత్యమేనన్నారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ లిటరరీ ఫోరంను ప్రారంభించి మాట్లాడుతూ సాహిత్యమే కాకుండా సాహిత్య సదస్సులు కూడా సమాజశ్రేయస్సుకు అవసరమన్నారు. కవులు, కళాకారులే కాకుండా సాహిత్య సదస్సులు సమాజశ్రేయస్సుకు ఉపయోగపడతాయన్నారు. మహాభారతం గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథమని, గురుచరణ కావ్యం ప్రపంచ భాషలన్నింటికి అనువదించబడిందని గుర్తు చేసారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన విఎస్‌యు వి.సి వీరయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు విశాల భావాలు అలవడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన పలువురు పూర్వకవులు ప్రసంగించారు. అనంతరం వింజమూరు మస్తాన్‌బాబు రచించిన కథల సంపుటి "మడేల్ మిట్ట కథలు" పుస్తకాన్ని డా॥ పాపినేని శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సదస్సులో కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ వెంకట్రావు, సంస్థ అధ్యక్షకార్యదర్శులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఏటూరు నాగేంద్రరావు, డాక్టర్ ఈదూరు సుధాకర్, వంజవాక సతీష్‌కుమార్‌రెడ్డి, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, దగ్గుమాటి పద్మాకర్, డా॥ రాజారామ్, డా॥ కుమ్మెర లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలను
# ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
**- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర**



తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పార్టీ నేతలకు సూచించారు. నెల్లూరులోని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఆదివారం నిర్వహించిన నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. బూత్ కమిటీల పరిధిలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 13వేల పట్టభద్రులు, 1300 ఉపాధ్యాయుల ఓటర్లు ఉన్నారని, వీరిని కలిసి తమ అభ్యర్థులకు తొలి ప్రాధాన్య ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి నగరాధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, చిరమన శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్నా సాహిత్య పురస్కారాలు



పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని డా॥ విజయ కుమార్ మెమోరియల్ నెల్లూరు ఆసుపత్రిలో రాష్ట్రస్థాయి పెన్నా సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి విక్రమ సింహపురి వర్సిటి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం దిశగా చైతన్యం కలిగించే విధంగా కవులు రచనలు కొనసాగించాలని కోరారు. ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించడంలో, సారా వ్యతిరేక ఉద్యమం లాంటి సామాజిక పోరాటాలు కలగడంలో కవులు, సాహితీవేత్తల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కర్నూలుకు చెందిన కథా రచయిత రంగనాథ రామచంద్రరావు రచించిన కథా సంపుటి "మళ్ళీ సూర్యోదయం"కి పెన్నా సాహిత్య పురస్కారం-2016ను అందించారు. పెన్నా రచయితల సంఘ అధ్యక్షకార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, బొగ్గవరపు మాల్యాద్రి, మెట్టు రామచంద్రప్రసాద్, విద్వాన్ కిరణశ్రీ, మోపూరు పెంచలనరసింహం, ఈదూరు సుధాకర్, అల్లాడి వేణుగోపాల్, సుమలత, రాధా రామకృష్ణ, భవానీ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తాం
**- ఎమ్మెల్యే పాశం**



## గూడూరు డివిజన్ వార్తలు

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఢంఖా మోగించేందుకు నియోజకవర్గంలోని నాయకులు సమిష్టిగా కలిసి పని చేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణం సమీపంలోని ఓ సమావేశ మందిరంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులతో ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 7 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 7110 ఓట్లు పట్టభద్ర ఓటర్లుగా నమోదైన జాబితా సిద్ధంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ బలపరచిన అభ్యర్థులను ప్రజాప్రతినిధులు, నాయకులు మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి ఓటర్ల జాబితాను సేకరించి ప్రతిఒక్కరి ఓటు పోల్ అయ్యేలా చూడాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారని, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పార్టీల నాయకులు మధుసూదనరెడ్డి, కోటిరెడ్డి మధురెడ్డి, నాగరాజు, రమాదేవి, రాజాచౌదరి, ఉప్పల ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మస్తానయ్య, కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు
**- పనబాక కృష్ణయ్య**



కాంగ్రెస్‌పాలనలో రాష్ట్రంలో, దేశంలో అనేక సంక్షేమ ఫలాలు, అభివృద్ధి జరిగినట్లు డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తెలిపారు. గూడూరు పట్టణం షాదీ మంజిల్‌లో జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు పరిచయం కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కోసం కోట్ల రూపాయలు వెచ్చించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను మభ్యపెట్టడమే చేస్తున్నాయని అభివృద్ధి చేయడం విస్మరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా సంఘ అధ్యక్షుడు జహంగీరు, డీసీసీ ఉపాధ్యక్షుడు పత్తి సీతారాంబాబు, సీనియర్ నాయకుడు జిలానీ భాషా, ఫియాజ్‌బాషా, శివాచారి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# రైల్వేస్టేషన్‌లోని సమస్యలు పరిష్కరించాలి
**- మయూరి శ్యాంయాదవ్**



జంక్షన్ కేంద్రమైన గూడూరు రైల్వేస్టేషన్‌లోని పలు సమస్యలు రైల్వేశాఖ ఉన్నతాధికారులు పరిష్కరించాలని ఇటీవల గూడూరు రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన దక్షణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు విన్నవించారు శ్రీకృష్ణ సేవాసమితి, శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్. ఈమేరకు ఆదివారం స్థానిక వనజాకృష్ణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరులో ఉన్న రైల్వేస్టేషన్ ఇటు చెన్నైకి, అటు తిరుపతికి ప్రధాన కేంద్రం కావడంతో అనేక ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, అలాగే పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని, ఇక్కడ నుండి రోడ్డు మార్గం మీదుగా తిరుమలకు వెళ్లేందుకు అనేక అవస్థలు పడుతున్నారని, ప్రధానంగా రైల్వేస్టేషన్‌లో విశ్రాంతి గదులు లేకపోవడం వలన సుదూరప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు వీలు లేకుండా పోతున్నదని అన్నారు. ఈ స్టేషన్‌లో ప్రయాణీకుల సౌకర్యం కోసం విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలన్నారు. గూడూరు రైల్వేస్టేషన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే జీఎం అన్నారని తెలిపారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, మధు, హనుమంతరావు, మాధవరావు, పుల్లయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఇటీవల గూడూరు మైథిలీ హాస్పిటల్ నందు నూతన భవనంలోని టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ ఓ.పిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ శ్రీనివాస్, మైథిలి హాస్పిటల్ డాక్టర్ మైథిలి, రమణబాబు తదితరులు.**



శ్రీను గల్పిక

# పిఎస్ఎల్వి రాకెట్‌కు ఎక్స్‌ట్రా ఎనర్జీ

వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ అది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా ప్రధాని పుతిన్, చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్, ఇంగ్లాండ్ ప్రధాని థెరిసా, జపాన్ ప్రధాని షింజో అబేలు అక్కడ సమావేశమై ఉన్నారు. మిగిలిన వారినుద్దేశించి డొనాల్డ్ ట్రంప్... ఆ ఇండియా వాళ్ళు చూడండి, ఒకే రాకెట్‌తో 104 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపుతున్నారట, ఆ ప్రయోగం సక్సెస్ అయితే అంతరిక్ష ప్రయోగాలలో వారికి తిరుగుండదు. అంతెందుకు మావే 96 ఉపగ్రహాలను ఇచ్చి వున్నాం. ఫెయిలైతే వారిని బ్లెయిమ్ చేయొచ్చు. సక్సెస్ అయితే మాతోపాటు మీరందరు కూడా మీ మీ దేశాల ఉపగ్రహాల ప్రయోగాలకు భారత్‌మీద ఆధారపడాల్సి వస్తుంది. అభివృద్ధిలో మనకంటే ఎక్కడో దూరంగా వున్న ఇండియా, అంతరిక్ష ప్రయోగాల్లో మనల్ని దాటిపోతుందంటే నా మనసెందుకో ఒప్పుకోవడం లేదు. అయినా ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాలను పంపించాలన్న ఆలోచన వీళ్ళకెందుకొచ్చిందని విచారం వ్యక్తం చేశాడు. అప్పుడు బ్రిటన్ ప్రధాని థెరిసా వుండి... ఆ భారతీయులు అంతేనంట సార్, ఇంతకుముందు వాళ్లని మేం పరిపాలించాం కదా, వారి మనస్తత్వం మాకు బాగా తెలుసు. ఇద్దరి కోసం తయారుచేసిన బైక్‌పై ఆరుగురు పోతుంటారు. ముగ్గురు ఎక్కే ఆటోలో 13మందిని కుక్కుతారు. నలభైమంది పట్టే బస్సులో నూటనలభైమంది సర్దుకుంటారు. వెయ్యిసీట్లున్న సినిమా హాల్లో ఎగస్ట్రా కుర్చీలేసి రెండువేలమందిని కూర్చోబెడతారు. విమానాలలో అనుమతించడం లేదు కాబట్టి సరిపోతుందిగాని, అనుమతిస్తే విమానాలలో అయినా నిలబడి ఇరుక్కుని ప్రయాణం చేసే రకం వాళ్ళు. ఇప్పుడు అదే సర్దుకుపోయే మనస్తత్వంతో ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాలను సర్దేసినట్లున్నారని చెప్పింది. జపాన్ ప్రధాని షింజోఅబే అందుకుని... భారత్ మాకు మంచి మిత్రరాజ్యం. ఆ దేశం ఒక గొప్ప ప్రయోగం జరుపుతున్నందుకు మాకు ఆనందంగా వుంది. మనం కూడా వెళ్ళి ఆ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా తిలకిద్దామన్నాడు. చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్ అందుకుని భారత్ మాకు శత్రురాజ్యం. మాకూ ఆ ప్రయోగాన్ని చూడాలని, ఆ రాకెట్ ప్రయోగానికి ఏం టెక్నాలజీ వాడుతున్నారో తెలుసుకోవాలనే దురద వుందన్నాడు. అయితే అందరం శాస్త్రవేత్తల రూపంలో షార్ సెంటర్‌కు పోదామని ట్రంప్ చెప్పడంతో అందరూ ఓకే అన్నారు.

★★★★★

షార్ సెంటర్‌లోని కంట్రోల్ రూం. ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, పలువురు శాస్త్రవేత్తలు వున్నారు. అందరిలోనూ టెన్షన్ కనిపిస్తోంది. కిరణ్‌కుమార్ వుండి... రేపే పిఎస్ఎల్వి-సి37 ప్రయోగం. ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాలను పంపుతున్నాం. సక్సెస్ అయితే మన ప్రతిష్ట ఉపగ్రహాలను దాటిపోతుంది. విఫలమైతే తలెత్తుకు తిరగలేం. అదీగాక ఎక్కువగా విదేశీ ఉపగ్రహాలనే ప్రయోగిస్తున్నాం. ఈ రాకెట్ ఫెయిల్ కాకుండా ఉండాలంటే ఎగస్ట్రా ఎనర్జీ ఇవ్వాలన్నాడు. కున్హికృష్ణన్ అందుకు బదులిస్తూ... సార్, ప్రయోగానికి ముందు ఏమేం చేయాలో అన్నీ చేసాం. రాకెట్ నమూనాను వెంకన్న పాదాల వద్ద ఉంచి పూజలు చేసాం, చెంగాళమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నాం. రాకెట్ లాంచ్ ప్యాడ్ వద్ద శాంతిహోమం, నవావరణ, గణపతి పూజలు నిర్వహించి దిష్టి కూడా తీసాం. వాస్తుకు అనుగుణంగానే లాంచ్‌ప్యాడ్‌కు రాకెట్‌ను నిలబెట్టామని చెప్పాడు. అందుకు కిరణ్‌కుమార్... ఒక్కోసారి మన బ్రెయిన్‌లతో పాటు ఇంకొన్ని బ్రెయిన్‌లలోని టెక్నిక్‌లు కూడా ప్రయోగాలకు ఉపయోగపడుతుంటాయి. ముఖ్యంగా ఈ విషయంలో ఈ జిల్లా రాజకీయ నాయకులను సంప్రదిస్తే బాగుంటుందనిపిస్తోంది. ఎందుకంటే ఈ జిల్లాలోని నాయకులు ఎప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తుంటారు. అంతెందుకు ఆ స్టైల్ ఆఫ్ సింహపురి వివేకాను చూడండి... 66లోనూ 26లా కనిపిస్తాడు. ముందు ఆయనకు ఫోన్ చేసి ప్రయోగం సమయానికి ఇక్కడకు రమ్మని చెప్పండి, వారు ఉత్సాహంగా ఉండేందుకు ఏం టెక్నిక్ వాడుతున్నారో తెలుసుకోండి, ఆయన సలహాలు మన ప్రయోగానికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పాడు.

★★★★★

రాకెట్ ప్రయోగానికి టైం దగ్గర పడింది. శాస్త్రవేత్తల రూపంలో వున్న ట్రంప్, థెరిసా, షింజోఅబే, జింగ్‌పింగ్, పుతిన్‌లు రాకెట్ వద్దకు చేరుకున్నారు. రాకెట్‌కు నాలుగు పక్కలా అరటి పిలకలు కట్టి, పసుపు, కుంకుమ అద్దారు. నలుగురు వేదపండితులు వచ్చి పూజలు చేస్తున్నారు. ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు ఆ పూజల్లో పాల్గొన్నారు. ఆ దృశ్యాన్ని చూస్తూ ట్రంప్ మిగతా వారితో వీళ్ళను చూస్తే నాకు ముచ్చటేస్తుంది. శాస్త్రీయ కార్యక్రమానికి కూడా సాంప్రదాయాన్ని జోడించిన వీరి సంస్కృతికి నా జోహార్ అని అన్నాడు. జింగ్‌పింగ్ తప్ప మిగతా వాళ్ళంతా... అవును అన్నట్లు తలూపారు. ఇస్రో ఛైర్మెన్ కిరణ్ ఓ పక్క పూజ చేస్తూనే వాచీ చూసుకుంటూ కున్హికృష్ణన్‌తో... రాహుకాలం రాకముందే రాకెట్‌ను పైకి పంపించాలని, ఇంకా ఆ వివేకా రాలేదా అని అడిగాడు. అప్పుడే అక్కడ వాహనం వచ్చిన అలికిడి... స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా ఒక పెద్ద వాటర్‌ట్యాంకర్‌తో అక్కడకు వచ్చాడు. అది చూసి కిరణ్‌కుమార్... ఇక్కడ మంచినీళ్లు మేం అరేంజ్ చేసాం, మీరెందుకు నెల్లూరు నుండి తేవడం అని అడిగాడు. అందుకు వివేకా... ఇవి మీరు తాగడానికి కాదు, అంటూ అప్పటికప్పుడు రాకెట్‌కు అమర్చిన నాలుగు స్ట్రాపాన్ మోటార్లలో నింపిన ఇంధనాన్ని ఖాళీ చేయించాడు. తర్వాత వాటిని తాను నెల్లూరు నుండి తెచ్చిన పెన్నానీళ్ళతో నింపి మోటార్లకు మూతపెట్టాడు. తర్వాత ఆయనే కిరణ్‌కుమార్‌తో ఇక కొట్టండి కిక్... అని చెప్పాడు. వివేకా మాట మీద నమ్మకంతో కిరణ్‌కుమార్ ప్రయోగానికి సిగ్నల్ ఇచ్చాడు. కౌంట్‌డౌన్ జీరోకు రాగానే పిఎస్ఎల్వి-సి37 నిప్పులు విరజిమ్ముకుంటూ నింగిలోకి దూసుకుపోయింది. అరగంట కాలంలో 104 ఉపగ్రహాలను నిర్దేశించిన కక్ష్యల్లో ప్రవేశపెట్టేసింది. కిరణ్‌కుమార్ అక్కడే వున్న వివేకా వద్దకు వెళ్ళి థాంక్స్ చెప్పగా, మీరు అడిగిన ఎగస్ట్రా ఎనర్జీ ఈ పెన్నానీళ్లే సార్! ఈ నీళ్ల తాగబట్టే మేం ఈ వయసులో కూడా చలాకీగా ఉంటున్నానని చెప్పి బయలుదేరాడు.

104 ఉపగ్రహాలను ఏ విధంగా విజయవంతం చేస్తారో చూద్దామని వచ్చిన ట్రంప్, షింజోఅబే, పుతిన్, జింగ్‌పింగ్, థెరిస్సాలు అసలు నీళ్ళతోనే రాకెట్‌ను పైకి పంపిన భారతీయ శాస్త్రవేత్తల ప్రతిభ చూసి అక్కడే మూర్ఛ వచ్చి పడిపోయారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి. వారం మధ్యలో అదనపు ఖర్చు పైనబడవచ్చును. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. బిడ్డల యొక్క విద్యా, వివాహ ఉద్యోగ విషయాలలో ఆందోళన ఉంటుంది. ఉద్యోగప్రయత్నాలు వెనుకబడతాయి. ప్రలోభాలకు లొంగకుండా ఉద్యోగులు పనిచేయాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాప్తి బాగుండి ఆదాయం పెరుగుతుంది. నూతన వస్తువులు సమకూరుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. భూ సంబంధ లావాదేవీలను వాయిదా వేసికొనండి. పనులు నెమ్మదిగా జరుగుతాయి. వేడుకలు శుభకార్యాలలో ప్రముఖంగా పాల్గొంటారు. ఉద్యోగులకు కార్యసామర్థ్యంతో పాటు పనివత్తిడి ఉంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక ఇబ్బందులు, వ్యవహారంలో ఇబ్బందులు సర్దుకుంటాయి. వృత్తి వ్యాపారాలు విస్తృతి మరియు ఆదాయ వృద్ధి కలదు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరగవచ్చును. భాగస్వామిక చర్చల్లో ప్రధాన పాత్ర వహిస్తారు. ముఖ్యమైన సర్టిఫికేట్, ప్రభుత్వ అనుమతులు పొందగలరు. పనులు సానుకూలం కాగలవు. విలువైన వస్తువులు సమకూరటం, దూరప్రయాణాలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యవహారాలలో తొందరపాటు ప్రదర్శించకండి. ఇబ్బందికరమగు పరిస్థితులు క్రమంగా చక్కబడగలవు. శుభవార్తలు వింటారు. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అధికారులకు పనివత్తిడి స్థానమార్పులుండవచ్చును. వ్యాపారవృద్ధి, అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఆదాయం షుమారుగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక పరిస్థితి క్రమంగా బాగుంటుంది. ఖర్చులు అదుపు చేయాలి. బంధువర్గంతో సంబంధాలు బలపడగలవు. ఉద్యోగులకు శ్రమ ఎక్కువైనా కార్యసమర్థత, గౌరవాలు బాగుంటాయి. వ్యాపార వృత్తి జీవనాలు లాభసాటిగా జరుగుతాయి. క్రయవిక్రయాలు వాయిదా వేయడం మంచిది. వస్తు వాహన, ఇంటి రిపేర్ల ఖర్చులు అదనం. అనుకున్న పనులు టెన్షన్‌తో సాగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేయదలచిన పనులందు ఆర్థిక వ్యవహారాలందు పొరపాట్లు రాకుండా చూచుకొనాలి. పనుల తీవ్రత ఇబ్బంది పెట్టవచ్చును. అయినా లగ్న గురువు వల్ల సమర్థవంతంగా పనులు నిర్వహిస్తారు. భాగస్వామిక చర్చలు వాయిదా పడతాయి. శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ఇతరులను అతిగా నమ్మవద్దు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 24.2.2017 నుండి

తేది. 2.3.2017 వరకు

ఈ వారం మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, మేషంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో రవిబుధ కేతువులు, మీనంలో శుక్రుడు కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 24 శుక్రవారము మహాశివరాత్రి

### ముహూర్తములు

తేది మార్చి 1 బుధవారము ఉదయం గంట 10.30 నుండి గంట 12.0లోగా వృషభ లగ్నమున వివాహ వ్యాపారాలు. రాత్రి గంట 11.26 నుండి గంట 1.34లోగా వృశ్చిక లగ్నమున గృహప్రవేశ, వివాహములు.

### మాఘమాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | త్రయోదశి | రా॥ గం.8.53వ॥ |
| తేది. 25 | శని | చతుర్దశి | రా॥ గం.9.06వ॥ |
| తేది. 26 | ఆది | అమావాస్య | రా॥ గం.8.45వ॥ |

### ఫాల్గుణ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | సోమ | పాడ్యమి | రా॥ గం.7.54వ॥ |
| తేది. 28 | మంగళ | విదియ | రా॥ గం. 6.42వ॥ |
| తేది. 1 | బుధ | తదియ | సా॥ గం.5.05వ॥ |
| తేది. 2 | గురు | చతుర్థి | సా॥ గం.3.10వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకోని ఖర్చులు పెరుగుతాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. ముఖ్య నోటీసులు అందుకుంటారు. బంధువర్గంతో పేచీలు రావచ్చును. విద్యార్థులు చదువుపై బాగా దృష్టి పెట్టాలి. బిడ్డల విద్యా ఉద్యోగ శుభకార్య విషయాలు ఆందోళన కలిగిస్తాయి. అనుకున్న పనులు జరుపుకొనడానికి శ్రమపడాల్సి ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుత్వ స్నేహాలు బలపడతాయి. వ్యాపార విస్తరణకు పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరిగి అభివృద్ధి ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు వస్తాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలు పొందుతారు. దూరం నుండి ఆహ్వానాలు అందుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. సన్నిహితులే ఇబ్బందులుపెట్టే అవకాశముంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

తొందరపాటు మాటలు, ప్రవర్తన లేకుండా జాగ్రత్త పడండి. ముఖ్యవిషయాలలో ఇతరుల సలహాలు తీసికొంటే మంచి జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో సామర్థ్యం, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, బంధుమిత్ర వర్గంతో సత్సంబంధాలు నెలకొంటాయి. ప్రముఖులతో పరిచయాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబంలో కొంత అనుకూలత లేకున్నా సర్దుబాటు చేసికొంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, కొత్త వ్యాపారాలు, పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. ఆర్థికంగా కుదుటపడతారు. తొందరపాటు లేకుండా ఆలోచన ముందు చూపుతో నిర్ణయాలు చేయండి. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక లావాదేవీలు ఉత్సాహపరుస్తాయి. స్థిరాస్తుల కొనుగోలు జరగవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా, టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు అందుతాయి. శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. నిరుద్యోగులకు మంచి అవకాశాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పనులు సక్రమంగా సానుకూలంగా జరుగుతాయి. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి సామాన్యంగా ఆదాయముంటుంది. మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. శుభకార్యాలలో పాల్గొంటారు. అదనపు ఖర్చులు తప్పని సరిగా ఉంటాయి. ఆహ్వానాలు, నోటీసులు అందుకుంటారు. కుటుంబసౌఖ్యం కలదు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరుకు చెందిన డాక్టర్ స్వర్గీయ పైడి శ్రీధర్‌రావు - చంద్రలతల కుమార్తె **డా॥ భవ్య - డా॥ రాహుల్** (అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటున్న గద్దె రమేష్‌బాబు - విజయలక్ష్మిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 19వ తేదీ నెల్లూరు, కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



యూఎన్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఊరిమిండి నరసారెడ్డి - పద్మప్రియల కుమార్తె **నిహారిక - శంకర్‌రెడ్డి** (ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామ వాస్తవ్యులు సిద్ధి సుబ్బారెడ్డి - కమలమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 16వ తేదీ నెల్లూరులోని జిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

# నేతన్నలకు అండగా నిలిచింది చంద్రన్నే!

**- డా॥ జెడ్.శివప్రసాద్**




రాష్ట్రంలోని చేనేత కార్మికుల, కుటుంబాల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తుందని టిడిపి అధికార ప్రతినిధి డా॥ జెడ్.శివప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో 21వ తేదీ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అగ్రనేతలు పార్టీ ఆదేశాల మేరకు గత రెండు నెలలుగా జిల్లాలోని చేనేత కుటుంబాలు ఉన్న ప్రాం తాల్లో పర్యటించి వారితో అన్ని సమస్యలపై చర్చించి దానికనుగుణంగా సమగ్ర నివేదికను తయారు చేసామని, త్వరలో ముఖ్యమంత్రికి అందజేయనున్నామన్నారు. ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో కూడా పర్యటించి చేనేతల స్థితిగతులు, ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై కూడా నివేదికలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి విజయవాడలో ప్రత్యేకంగా మంత్రులతో, నేతన్నలతో చేనేత కుటుంబాల సంక్షేమానికి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరిగిందన్నారు. రాష్ట్ర జనాభాలో 12శాతంగా ఉన్న నేతన్నలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందులో ముఖ్యంగా రూ.110కోట్లతో 24,309 చేనేత కుటుంబాలకు రుణమాఫీ చేశారని, రైతుబజార్లు తరహాలో 13జిల్లాల్లో త్వరలోనే చేనేత బజార్లను ఏర్పాటు చేయనున్నారని, రూ.25కోట్లతో వర్క్‌షెడ్‌లను నిర్మించనున్నారని, ఒక్కో క్లస్టర్‌కు రూ.2కోట్లు వంతున రాష్ట్రంలో 18వేల మందికి ప్రత్యక్షంగా, 25వేలమందికి పరోక్షంగా లబ్ది చేకూరేలా రూ.100కోట్లతో 50 చేనేత క్లస్టర్లను నిర్మించనున్నారన్నారు. వచ్చే ఏప్రిల్ నుండి చేనేత కుటుంబాలకు బీమా పథకాన్ని అమలు చేయనున్నారని తెలిపారు. దీంతోపాటు పట్టు రాయితీని 4కేజీలకు, ప్రస్తుతమున్న 600 నుండి వెయ్యి రూపాయలకు పవర్ హ్యాండ్‌లూమ్స్‌ను నియంత్రించేందుకు చేనేతల కోసం మెగా టెక్స్‌టైల్ పార్కులను, జనతా వస్త్రాల పేరుతో తెల్లరేషన్ కార్డుదారులకు సబ్సిడీపై చేనేత వస్త్రాలను అందించేందుకు రూ.50కోట్లను, దీనదయాళ్ పథకంలో చేనేత కార్మికులకు గృహనిర్మాణం పథకాన్ని, ప్రతి చేనేత కుటుంబానికి 25 అంకణాల స్థలంలో 9అంకణాలలో ఇంటి నిర్మాణంతో పాటు 100యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 55సంవత్సరాలు పూర్తి చేసుకున్న లక్షమంది చేనేత కార్మికులకు వెయ్యి రూపాయలు వంతున పింఛన్ అందజేయనున్నామన్నారు. నెల్లూరుజిల్లా వెంకటగిరిలో రూ.300కోట్లతో శిల్క్‌పరిశ్రమ ఏర్పాటు, హ్యాండ్‌లూమ్ ట్రైనింగ్ ఎడ్యుకేషన్ కాలేజీలో ప్రస్తుతమున్న 60సీట్లను 100సీట్లకు పెంచడంతో పాటు స్టైఫండ్‌ను రూ.5వేలకు పెంచుతూ ఈ కాలేజీని పూర్తి స్థాయిలో నిర్మించేందుకు 50ఎకరాల స్థలాన్ని కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. నేతన్నల సమస్యలపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## శ్రీకాళహస్తీశ్వరునికి బ్రహ్మోత్సవ సేవలు

### - మార్చి 3 దాకా నేత్రపర్వంగా శివరాత్రి వేడుకలు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో కొలువై వున్న శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామి-అమ్మవార్లకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవ సేవలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 3వ తేది వరకు జరుగుతున్న ఈ వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తరిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు 19వ తేదీన అంకురార్పణ జరిగింది. శ్రీ భక్త కన్నప్ప ధ్వజారోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవ సేవలు ప్రారంభమయ్యాయి. 20వ తేదిన శ్రీస్వామి వారి ధ్వజారోహణం, దేవరాత్రి కార్యక్రమాలతో పాటు ఉదయం-రాత్రి స్వామివార్లకు వెండి అంబారీసేవలు నిర్వహించారు. 21న భూత రాత్రిని పురస్కరించుకుని ఉదయం సూర్యప్రభ వాహనసేవ, చప్పర వాహనసేవ, రాత్రి భూతవాహనసేవ, చిలుక వాహనసేవలు వైభవంగా నిర్వహించారు. 22వ తేది గాంధర్వ రాత్రిని పురస్కరించుకుని ఉదయం హంస-యాళివాహన సేవ, రాత్రికి రావణుడు-నెమలి వాహన సేవలు నిర్వహించారు. 23న నాగరాత్రి సందర్భంగా ఉదయం హంస-చిలుక వాహనసేవలు, రాత్రికి శేష వాహనం, యాళి వాహన సేవలు నేత్రపర్వంగా చేపట్టారు. 24న మహాశివరాత్రి సందర్భంగా స్వామివార్లకు ఉదయం ఇంద్ర విమాన వాహనసేవ, చప్పర సేవ నిర్వహించి, రాత్రి 9.30 గంటలకు నంది వాహనసేవ, సింహ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తరలివచ్చిన భక్తజన సందోహంతో శ్రీకాళహస్తి క్రిక్కిరిసిపోయింది. కాగా, ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజైన 25వ తేది బ్రహ్మరాత్రిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు ఎంతో వేడుకగా రథోత్సవం నిర్వహిస్తామని, రాత్రి 8.30 గంటలకు తెప్పోత్సవం వుంటుందని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట గురవయ్య నాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ తెలియజేశారు. ఆదివారం (26వ తేది) స్కందరాత్రిని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తామని, ఉదయం 10గంటలకు నంది వాహనసేవ-కామధేనువు వాహన సేవ వుంటాయని వారు పేర్కొన్నారు. రాత్రి 9 గంటలకు ఏనుగు వాహనసేవ, సింహ వాహనసేవ వుంటాయని, 27వ తేది ఉదయాత్పూర్వం 3 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. 27వ తేది ఆనందరాత్రి సందర్భంగా స్వామివార్లకు ఉదయం 11 గంటలకు రుద్రాక్ష అంబారి వాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ సభాపతి కల్యాణం వుంటాయని 28న రుషిరాత్రిని పురస్కరించుకుని ఉదయం 8 గంటలకు కైలాసగిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని, ఉదయం బనాత అంబారీ వాహనసేవ, సాయంత్రం అశ్వవాహనోత్సవం, సింహ వాహనసేవ వుంటాయన్నారు. మార్చి 1న దేవరాత్రి సందర్భంగా తీర్థవారి ధ్వజావరోహణం చేస్తామని, స్వామివార్లకు ఉదయం 9 గంటలకు కేడిగ వాహనసేవ, రాత్రి సింహ వాహనసేవ వుంటాయని, మార్చి 2న రాత్రి 8.30 గంటలకు పల్లకీసేవ, 3వ తేదిన స్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 9.30 గంటలకు ఆలయం లోపల స్వామివారికి పల్లకీసేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా 19 నుంచి వచ్చే నెల 3వ తేది వరకు ప్రతి రోజూ ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, భక్తులందరూ పరమపుణ్యప్రదమైన ఈ శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని శ్రీకాళహస్తీశ్వరస్వామిని-అమ్మవారిని దర్శించుకుని తరించాలని వారు విజ్ఞప్తిచేశారు.

# సార్క్ సాహితీసదస్సుకు పెరుగు దంపతులు



న్యూ ఢిల్లీలోని ఇండియా ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో భారతప్రభుత్వం, విదేశీమంత్రిత్వ శాఖ, ఐసిసిఆర్, ఫౌండేషన్ ఆఫ్ సార్క్ రైటర్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 నుంచి 26వ తేది వరకు జరిగే సార్క్ శిఖరాగ్ర దక్షిణ ఆసియా సాహిత్యోత్సవంలో పాల్గొనేందుకు నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, ఆయన సతీమణి శ్రీమతి పెరుగు సుజనా రామంలకు ఆహ్వానం అందింది. పోస్వాల్ సంస్థ అధ్యక్షురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అజిత్ ఆ మేరకు వీరికి ఆహ్వానం పంపినట్లు పెరుగు రామకృష్ణ తెలిపారు. ఉగ్రవాదం, తీవ్రవాదంలకు వ్యతిరేకంగా జరిగే ఈ సదస్సులో విదేశాల నుంచి కూడా కవులు, రచయితలు, మేధావులు పాల్గొంటారని తెలిపారు.

ముఖ్యంగా భారత్‌తో పాటు శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్ తదితర దేశాల నుంచి రచయితలు పాల్గొని ఉగ్రవాదం, తీవ్రవాదాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమ రచనలు వినిపిస్తారని ఆయన పేర్కొన్నారు.

## కాలధర్మం

### ముప్పవరపు రామతులశమ్మ



ముప్పవరపు గోపాలకృష్ణ చౌదరిగా కంటే విజయ డెయిరీ గోపాలకృష్ణయ్యగా అందరికీ సుపరిచితుడైన గోపాలకృష్ణయ్యచౌదరి సతీమణి శ్రీమతి రామతులశమ్మ ఈ నెల 11వ తేదీ కన్నుమూసారు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. టి.పి.గూడూరు మండలం సౌత్‌ఆములూరు స్వగ్రామం. గోపాలకృష్ణయ్య చౌదరి రాజకీయ ప్రస్థానంలో ఆమె అందించిన సహకారం మరువలేనిది. ఆమె మృతికి సంతాపం తెలుపుతూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# వియస్‌యు సమస్యలపై విద్యార్థుల పాదయాత్ర

## - పవన్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు పయనం



విక్రమ సింహపురి యూనివర్సిటీలో అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన అవినీతి, అక్రమాలు, సమస్యలపై పోరాటం సాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఆ సమస్యలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళేందుకు నెల్లూరు వియస్‌యు కళాశాల ప్రాంగణం నుంచి హైదరాబాద్‌కు విద్యార్థులు పాదయాత్ర చేపట్టారు. చిరంజీవి యువత రాష్ట్ర నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, జనసేన-జిల్లా పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నాయకులు పి.టోనిబాబు, మురళీరెడ్డి ఆ విద్యార్థులకు పూలమాలలు వేసి పాదయాత్ర శుభప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ ఉద్యమానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర విద్యార్థి జెఎసి ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి అంజయ్య, బిసిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ యాదవ్ తదితరులంతా పాదయాత్ర చేస్తున్న విద్యార్థి బృందానికి మద్దతు ప్రకటించి, వారి పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పాదయాత్ర చేపట్టిన వర్శిటీ విద్యార్థులు జొన్నలగడ్డ సుధీర్, గంగిరెడ్డి, శ్రీకాంత్, కిరణ్, శ్రీనివాసులు, ఆవులయ్య, వినయ్, వైభవ్, గణేష్, రాజేష్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొన్నేళ్ళుగా వర్శిటీలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, ఇందుకు కారణం రిజిస్ట్రార్ శివశంకర్‌తోపాటు, ఆయనకు అండగా వున్న వి.సి వీరయ్యలే కారణమని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. వియస్‌యు అక్రమాల గురించి ఎందరు నాయకులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ సమస్యలు తీసుకువస్తే ఆ సమస్యలను ఆయన పరిష్కరించగలరనే ఎంతో నమ్మకంతో ఈ పాదయాత్ర చేపట్టామని వారు తెలిపారు. అనంతరం విద్యార్థులంతా పాదయాత్రగా వియస్‌యు నుంచి విఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి గాంధీబొమ్మ, పివిఆర్ బస్టాండ్, వెంకటేశ్వరపురం మీదుగా పాదయాత్ర కొనసాగించారు. పాదయాత్ర చేస్తున్న వీరందరికీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల వారు తమ సంపూర్ణమద్దతు ప్రకటించారు.

# జీతాలు ఇప్పించండి మహాప్రభో..

గత అయిదు నెలలుగా జీతాలు అందక నెల్లూరు నగర కార్పొరేషన్‌లోని కాంట్రాక్టు కార్మికులు లబోదిబోమంటున్నారు. అప్పు సొప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, తమకు రావలసిన అయిదు నెలల జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు ఏడాది క్రితం 200మంది కార్మికులను కాంట్రాక్టు పద్ధతిపై తీసుకున్నారు. వారిని నగరంలోని అన్ని డివిజన్‌లలో నియమించి సొసైటి కార్మికులతో పాటు వారిచేత పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. పాత కమిషనర్ వెంకటేశ్వర్లు బదిలీకి రెండు నెలల ముందు నుంచి జీతాలు ఆగిపోయాయి. ఆయన తర్వాత ఇన్‌ఛార్జ్ కమిషనర్లుగా వచ్చిన ఇంతియాజ్, రామిరెడ్డి కార్మికుల వేతనాలను మంజూరు చేయలేదు. దీంతో కార్మికులంతా పూటగడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట పనులకు పోతే ఎక్కడ తీసేస్తారోనని బయట పని చేయలేక ఇక్కడ పని చేసినా జీతాలు ఇవ్వకపోవడంతో ఆకలి బాధలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఓట్లు తెచ్చేది ఒక్కటీ లేదు!

(మొదటి పేజీ తరువాయి)

రెండు రూపాయల కిలో బియ్యం పథకం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఎన్టీఆర్‌కు మళ్ళీ ఓట్లేసేలా చేసింది.

2004లో చంద్రబాబు వ్యతిరేకత మీద కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా వై.యస్.రాజశేఖరరెడ్డి రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేపట్టనన్ని ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, 108 అంబులెన్స్, పింఛన్‌లు, డ్వాక్రా ఋణాలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, సెజ్‌ల ఏర్పాటుతో విరివిగా ఉపాధి అవకాశాలు... ఇవన్నీ కూడా వై.యస్.కు ఓట్లు కురిపించాయి. 2009 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్‌ను గెలిపించాయి. అంతేకాదు, వై.యస్ అయిదేళ్ల పాలనలో పన్నులు పెంచి ప్రజలపై భారం మోపిన దాఖలాలు లేవు. వై.యస్. ఇంత చేసినా కూడా 2004తో పోలిస్తే 2009కి కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు తగ్గాయి. గత మూడు దశాబ్దాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే రాష్ట్రంలో ఒక ముఖ్యమంత్రిగా వై.యస్. చేసినంత అభివృద్ధి, అమలు చేసినన్ని పథకాలు ఇంకే ముఖ్యమంత్రీ చేయలేదు. ఆయన అంత చేస్తేనే సీట్లు తగ్గాయి. మరి ఇంతవరకు ఏమీ చేయని చంద్రబాబు పరిస్థితి ఎలా ఉండబోతుంది?

ఈ మూడేళ్లలో ప్రజలు ఫలానా పథకం వల్ల ప్రయోజనం పొందారని చెప్పే పథకం ఒక్కటీ లేదు. ఏ పథకం మీద కూడా చంద్రబాబు బ్రాండ్ లేదు. తెలుగుదేశంకు అదనంగా ఓట్లు తెచ్చే ఒక్క స్కీంను కూడా కొత్తగా తేలేకపోయారు. గతంలో వై.యస్. ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లు కూడా అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణం వల్ల కోట్లు పోతున్నాయి గాని ఓట్లు రావు. ఈ రాజధాని ప్రజల సబ్జెక్ట్ కాదు. మా రాజధాని వాషింగ్టన్‌లా ఉండాలని, సింగపూర్‌లా ఉండాలని ప్రజలు కోరుకోవడం లేదు. చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొదటి పని ఇదే! దీనివల్ల ఓట్లు రావడం మాటేమో గాని, రాజధాని రూపంలో భూములు కోల్పోయిన రైతుల ఓట్లు పోయే అవకాశాలున్నాయి. అలాగే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సెజ్‌ల పేరుతో సాగిస్తున్న భూదోపిడీ మూలంగా రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుంది. అంతేకాదు, గత ఎన్నికల్లో చంద్రబాబు చేసిన ఋణ మాఫీ వాగ్దానం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. చంద్రబాబు అమలు చేసిన అరకొర ఋణమాఫీ వల్ల లాభపడ్డ వాళ్లకంటే ఆశపడి భంగపడ్డ వాళ్ళే ఎక్కువ! విఫలమైన ఋణమాఫీ విషయంలో చంద్రబాబుకు ఓట్ల నష్టం కలుగనుంది. డ్వాక్రా ఋణాల మాఫీని గాలిలో పెట్టడంతో మహిళలు వ్యతిరేకమయ్యారు. ఇక నిరుద్యోగ భృతి లేదు, కొత్తగా ఉద్యోగాలు లేవు. అన్నింటికి మించి చంద్రబాబే స్వయంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తుండడంతో యువతలో, నిరుద్యోగుల్లో తెలుగుదేశం పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. అన్నింటికి మించి విచ్చలవిడి అవినీతి, యధేచ్ఛగా తెలుగు తమ్ముళ్ళ దోపిడీ వంటివి కూడా తెలుగుదేశం ఓటు బ్యాంకుకు చిల్లు పెట్టాయి.

2014 ఎన్నికల్లో తెలుగుదేశం, వైకాపాకు మధ్య ఓట్ల తేడా కేవలం 5లక్షలే! ఈ మూడేళ్లలో వైకాపా నుండి ఎమ్మెల్యేలు, నాయకులు వచ్చి తెలుగుదేశంలో చేరారు. కాని వారితో పాటు పెద్దగా జనం రాలేదు. వీళ్ళ మూలంగా తెలుగుదేశంకు కలిసే ఓట్లు తక్కువ. కాని 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వాన్ని, ఆయన అనుభవాన్ని, ఆయన సమర్ధతను నమ్మి ఉద్యోగులు, యువత, వ్యాపారులు, నిరుద్యోగులు, కాపులు, వైశ్యులు, బ్రాహ్మణులు తెలుగుదేశంకు మద్దతుగా నిలిచారు. 2014లో వైకాపాకు మద్దతుగా నిలిచిన ఓటర్లలో పెద్ద మార్పుండదు. కాని తెలుగుదేశంకు ఓటేసిన వర్గాల ప్రజల్లో మాత్రం మార్పు ఉంటుంది. వారిలో సగం మంది చంద్రబాబును వ్యతిరేకిస్తే చాలు... అధికారం తలక్రిందులే!

చంద్రబాబు ప్రజాదరణ పొందే ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా ఇంతవరకు అమలు చేయలేదు. వచ్చే ఎన్నికల్లో వై.యస్ సానుభూతి, తన ఆకర్షణ జగన్‌కు ప్రచారాస్త్రాలు కాదు... చంద్రబాబు వైఫల్యాలే జగన్ ఆయుధాలు!

# ప్రజలకు బాసటగా వుంటాం

## కాంగ్రెస్ నేత పనబాక

జిల్లా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రజలకు బాసటగా వుండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య అన్నారు. ఆ మేరకు ఆయన జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ ముఖ్యనేతలతో మాట్లాడారు. నెల్లూరు ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఇటీవల విజయవాడలో సమావేశమై ప్రజల ఆందోళనలకు స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తగు సూచనలు చేశారని, ఆ ప్రకారం జిల్లాలోనూ కార్యాచరణకు కృషి చేస్తామన్నారు. జిల్లా సీనియర్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ప్రధానంగా తాగునీరు, సాగునీటి సమస్యలపై ఈ నెల 25న ముఖ్యనేతలతో కలసి కలెక్టర్‌ను సంప్రదిస్తామన్నారు. 26న అన్ని మండలాల నేతలతో ఇందిరా భవన్‌లో సమావేశం నిర్వహిస్తామని, మార్చి4 నుంచి 15 వరకు జన ఆవేదన సదస్సులను నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా, మాజీప్రధాని ఇందిరాగాంధీ శతజయంతి ఉత్సవాలను ప్రతి గ్రామంలోనూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మార్చి 15న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బైక్‌ర్యాలీని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పనబాకతో పాటు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్, పార్టీ సీనియర్ నేతలు సివి శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, చేవూరు దేవకుమార్‌రెడ్డి, భవాని నాగేంద్ర, రఘురామ్ ముదిరాజ్, పత్తి సీతారాంబాబు, శివాచార్య, ఆసిఫ్‌బాషా, షేక్ ఫయాజ్, శివప్రసాద్, అనూరాధారెడ్డి, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనం ఆటకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

చనువు కొద్ది మా విషయంలో మినహాయింపు ఉంటుందిలే అని అనుకున్నారు. చంద్రబాబు ఎవర్నీ నెత్తికెక్కించుకోడు... ఎవర్ని ఎక్కడ తొక్కాలో అక్కడ తొక్కుతుంటాడు. ఎవరినైనా వాడుకోవడంలో మంచి ఎక్స్‌పర్ట్. అతనిముందు రాజకీయాలలో తలపండిన ఆనం సోదరుల ఆటలు సాగడం లేదు. జిల్లా తెలుగుదేశం పార్టీ పెత్తనాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలనుకున్న వారి కలలు నెరవేరడం లేదు.

ఆనం సోదరుల రాజకీయ చరిత్రను ఒక సినిమాగా చూస్తే 60ఏళ్ల చరిత్రను ఒక పార్ట్‌గా తీసుకోవచ్చు, 2014 నుండి ఈ మూడేళ్ళ చరిత్రను రెండోపార్ట్‌గా అనుకోవచ్చు. 2014కు ముందు వాళ్ళు ఏ పార్టీలో వున్నా రాజకీయంగా కింగ్‌లే! క్రిందపడ్డా, నిలబడ్డా ఎప్పుడూ చక్రం మాత్రం తిప్పుతుండేవాళ్ళు. ఎక్కువకాలం వారి రాజకీయ ప్రయాణం కాంగ్రెస్‌పార్టీలోనే కొనసాగింది. మరీ ముఖ్యంగా 1999 నుండి 2014 మధ్యకాలంలో నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌లో వారు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా సాగింది. వై.యస్.తో ఏర్పడ్డ సాన్నిహిత్యంతో జిల్లా కాంగ్రెస్‌లో వారిని తిరుగులేని నాయకులుగా చేసింది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అంతటివాడు అడ్డంపడ్డప్పటికీ 1999లో వివేకాకు నెల్లూరు అసెంబ్లీ టిక్కెట్ వచ్చింది. 2004 ఎన్నికలొచ్చేసరికి నేదురుమల్లి అంతటి వాడు నెల్లూరు అభ్యర్థిగా వివేకానే సమర్ధుడు అంటూ కితాబిచ్చే పరిస్థితి వచ్చింది. 2009 ఎన్నికల నాటికి ఆనం సోదరులిద్దరికీ టిక్కెట్లు తెచ్చుకోవడమేకాదు, ఇంకా కొన్ని నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికలో వీరి మాటకు ప్రాధాన్యత ఏర్పడింది. 2004-2009 ఎన్నికల మధ్యలో జిల్లా కాంగ్రెస్‌లో నేదురుమల్లిపై ఆనందే పైచేయి అయ్యింది. ఒకనాడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీనే శాసించిన నేదురుమల్లి చివరకు తన వెంకటగిరి సీటుకు మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి వచ్చింది. వై.యస్. ఇచ్చిన ఫ్రీహ్యాండ్‌తో జిల్లా కాంగ్రెస్‌లో ఆనం సోదరులు తిరుగులేని నాయకులయ్యారు. వై.యస్. మరణం తర్వాత కూడా పార్టీలో వారికి అదే ప్రాధాన్యత లభించింది. 2014 ఎన్నికల దాకా జిల్లాలో వారి హవానే సాగింది. ఆ ఎన్నికల తర్వాత ఈ రాష్ట్రంలోనే కాదు, ఇక తమ గుండెల్లోనూ కాంగ్రెస్‌కు స్థానం లేదనుకున్నారు. కాంగ్రెస్‌పార్టీని వదిలేసి తెలుగుదేశంలో చేరారు. ఇక్కడితో సినిమా ఇంటర్వెల్ అనుకోవచ్చు.

రెండోపార్ట్‌లో చూస్తే నలుగురు బ్రదర్స్‌లో అప్పటికే ఒక బ్రదర్ ఆనం జయకుమార్‌రెడ్డి విడిపోయి వున్నాడు. ఎన్నికలకు ముందు 'జై సమైక్యాంధ్ర' పార్టీలో చేరిన ఆయన, ఎన్నికల తర్వాత ఆదాల ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశంలోకి మారాడు. మరో తమ్ముడు ఆనం విజయకుమార్‌రెడ్డి తెలుగుదేశంలో చేరిన తన బ్రదర్స్‌తో విభేదించి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. ఆనం వివేకా, ఆనం రామనారాయణరెడ్డిలు మాత్రం చంద్రబాబు నాయకత్వాన తెలుగుదేశంతో కొత్త ప్రయాణం మొదలుపెట్టారు.

తెలుగుదేశం కాంగ్రెస్ అయ్యింది... అంటే ఇది పాత తెలుగుదేశం కాదు. 1983లో ఆనం కుటుంబమున్నప్పటి తెలుగుదేశం కాదు. ఇక్కడ సీనియార్టీతో పాటు సిన్సియార్టీకి విలువ లేదు. క్యాష్‌పార్టీల హవానే ఎక్కువగా నడుస్తుంది. ఒకప్పుడు తమ విద్యాసంస్థలలో డెమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసి, తమ చేతుల మీదుగా జీతం తీసుకున్న నారాయణ, ఇప్పుడు చంద్రబాబు కుడి భుజం. మంత్రి కూడా! తెలుగుదేశం పార్టీలో తమకు ఏ అవసరం వచ్చినా ఆనం సోదరులు పోయి నారాయణను కలవాల్సివస్తోంది. తమ ముందు చెడ్డీ లేసుకుని తిరిగిన ఎమ్మెల్సీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని వీరుడు, శూరుడు అంటూ పొగిడి ప్రచారం చేయాల్సి వస్తోంది. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆనం సోదరులే నిర్ణయించే పరిస్థితి. ఇప్పుడు తమకు ఎమ్మెల్సీ టిక్కెట్ కావాలని చంద్రబాబును అడుక్కునే దుస్థితి. అది కూడా ఆయన చేత కాదు, వీలుకాదు అనిపించుకునే దౌర్భాగ్యం. పార్టీలో మీకంటే మేం సీనియర్లం అంటూ వారిని చూసి మేయర్ అబ్దుల్ అజీజ్ వంటి ఛోటా నాయకులు కూడా కాలెగరేస్తున్నారు. ఇదంతా ఎలా వుందంటే... 'సమరసింహారెడ్డి' సినిమాలో హీరో బాలకృష్ణ ఒక కాకా హోటల్‌లో కప్పులు కడిగే పనిలో వుంటాడు. అతని ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే అరివీరభయంకరమైన ఫ్యాక్షనిస్టన్న మాట! ఆనం రాజకీయ చరిత్ర కూడా ఇక ఆ సినిమాలో ఫ్లాష్‌బ్యాక్‌లాగా ఘనంగా మిగిలిపోతుందేమో?

## బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానందశాస్త్రికి

# 'మహామహోపాధ్యాయ' బిరుదు ప్రదానం



నెల్లూరులోని వేదసంస్కృతపాఠశాలలో ఎంతోకాలం వ్యాకరణ అధ్యాపకులుగా పనిచేసి, కొంతకాలం క్రితం ఉద్యోగవిరమణ చేసిన బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానందశాస్త్రిగారికి ఎంతో విశిష్టమైన 'మహామహోపాధ్యాయ' బిరుదు లభించింది. మహాపండితులకు మాత్రమే ప్రదానం చేసే ఈ ఘనమైన పురస్కారం వ్యాకరణ శాస్త్రంలో గొప్పపండితునిగా పేరుగాంచిన చింతలపాటి పూర్ణానందశాస్త్రిగారికి లభించడం విశేషం.

గురువారం తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ మురళీధరశర్మ సమక్షంలో, ఛాన్సలర్ గోపాలస్వామి చేతుల మీదుగా బ్రహ్మశ్రీ పూర్ణానందశాస్త్రిగారు ఈ ప్రతిష్టాత్మకమైన బిరుదును, ఘనసన్మానాన్ని అందుకున్నారు. దీనితో పాటు జ్ఞాపిక, సన్మానపత్రాలను ఆయనకు అందజేశారు. బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానందశాస్త్రి తల్లిదండ్రులు బ్రహ్మశ్రీ వేంకటేశ్వర సిద్ధాంతి–శ్రీమతి సరస్వతిగార్లు. శ్రీ పూర్ణానంద శాస్త్రిగారి సంస్కృత గురువు బ్రహ్మశ్రీ ప్రతాపగిరి శివరామశాస్త్రి గారు. వీరి స్వస్థలం ప్రకాశం జిల్లా కొప్పరం గ్రామం అయినప్పటికీ, బ్రహ్మశ్రీ పూర్ణానందశాస్త్రిగారు ఎంతోకాలంగా నెల్లూరులోనే స్థిరపడ్డారు. నెల్లూరుతో ఏళ్ళతరబడి ఆయనకు అనుబంధం వుంది. 1973 నుంచి 2007 దాకా నెల్లూరులోని వేదసంస్కృత పాఠశాలలో వ్యాకరణ అధ్యాపకులుగా, 2004–2007 మధ్య కాలంలో ఈ కళాశాలలోనే ప్రధాన అధ్యాపకులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతం నెల్లూరులోనే నివాసం వుంటున్నారు. వ్యాకరణశాస్త్రంలో అమోఘమైన పరిజ్ఞానం ఆయన సొంతం. వ్యాకరణశాస్త్రమే శ్వాసగా జీవించే శ్రీ శాస్త్రిగారు వ్యాకరణశాస్త్రంలో 'సమాస పారిజాతము' అనే గ్రంథం కూడా రచించారు. అద్వైతం, ఆలంకారం, జ్యోతిషశాస్త్రాల్లోనూ ఆయన సుప్రసిద్ధులు. సంస్కృత అధ్యాపకుల్లో ఆణిముత్యం వంటివారైన శ్రీ శాస్త్రిగారు 'వ్యాకరణ విద్వాన్', 'వ్యాకరణ భాస్కర', 'నవ్య వ్యాస' వంటి శ్రేష్ఠమైన బిరుదులను కూడా పొందివున్నారు.

నెల్లూరు వేదసంస్కృత పాఠశాలలో అధ్యాపకునిగా వుంటూ ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దిన శ్రీ పూర్ణానందశాస్త్రిగారికి జిల్లావ్యాప్తంగా అనేక మంది శిష్యులున్నారు. సంస్కృత భాషలో పండితునిగా పేరుగాంచిన శ్రీ పూర్ణానంద శాస్త్రి గారు నెల్లూరులో అనేక సభలు, సమావేశాల్లోనూ పాల్గొని పంచాంగ శ్రవణం, జ్యోతిష్య శాస్త్రం వంటి అంశాలను ప్రజలకు విశదమయ్యేలా చెప్పేవారు. అలాంటి ఉత్తమ గురువుకి..ఎంతో ప్రఖ్యాతమైన 'మహామహోపాధ్యాయ' బిరుదు లభించడం పట్ల వారి శిష్యులు, సహ ఉపాధ్యాయులు..నెల్లూరీయులంతా తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో మహాపండితుడుగా ప్రసిద్ధి చెందిన బ్రహ్మశ్రీ వేదం వేంకట రాయశాస్త్రిగారి తర్వాత, చాలా కాలానికి.. అంతటి విఖ్యాతి బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానందశాస్త్రిగారికి లభించడం ఎంతైనా అపూర్వం. ఆ మహాపండితునికి.. ఎంతో విశిష్టమైన 'మహామహోపాధ్యాయ' బిరుదాంకితునికి..'లాయర్' మన:పూర్వక శుభాకాంక్షలు.

# మేకిన్ ఇండియాతో ముందడుగు!

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మేక్‌ఇన్ ఇండియా' విజయవంతమైతే భారతదేశ చరిత్రే మారిపోతుందని, ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా దూసుకుపోతుందని కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు యల్లాల వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కొండా ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు వింజమూరుకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేకిన్ ఇండియా అమలుకు కేంద్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. మన దేశంలో దిగుమతులు ఎక్కువగాను, ఎగుమతులు తక్కువగానూ ఉన్నాయని, ఈ దేశం నుండి ఎగుమతులను పెంచడం కోసం, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసం ప్రధాని నరేంద్ర మోడీ మేకిన్ ఇండియాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని ఆయన అన్నారు. ప్రతి ఏటా మన దేశం చైనా నుండి 71మిలియన్ డాలర్ల వస్తువులను దిగుమతి చేసుకుంటుండగా, 9మిలియన్ డాలర్ల వస్తువులను మాత్రమే ఎగుమతి చేయగలుగుతున్నామన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో చైనా మనకంటే ఎంతో ముందుంది. ప్రపంచంలో తయారవుతున్న మొబైల్స్‌లో 46 శాతం మార్కెట్ చైనాదే! వాటిలో 13 శాతం ఉత్పత్తులను భారత్‌లోనే విక్రయిస్తున్నారు. చైనా వస్తువుల ధాటికి మన దేశీయ పరిశ్రమలు మూతపడుతున్నాయి. లక్షలాది మంది నిరుద్యోగులవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భారత ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింటుంది. ప్రపంచంలోనే ఉత్పత్తి రంగంలో భారత్ వాటా దారుణంగా పడిపోతుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు భారత్ నుండి ఉత్పత్తులు పెంచేందుకు కేంద్రప్రభుత్వం మేకిన్ ఇండియాకు శ్రీకారం చుట్టింది. పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తూ సరికొత్త పారిశ్రామిక విధానంతో కేంద్రం ముందడుగు వేస్తుందన్నారు. ప్రతి పరిశ్రమలో కూడా మూడోవంతు స్థలంలో చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు.



వై.వి.రామిరెడ్డిని సత్కరిస్తున్న స్థానికులు






ఉత్తరక్రియలు

మానవతామూర్తి, మమతానురాగాల అమృతమూర్తి

శ్రీమతి ముప్పవరపు రామతులశమ్మ గారు

(విజయడెయిరీ మాజీఛైర్మెన్, డిఎల్‌డిఎ ఛైర్మెన్ ముప్పవరపు గోపాలకృష్ణయ్యచౌదరి సతీమణి)

ఈ నెల 11వ తేదీ శనివారం స్వర్గస్తురాలైనారు.

వారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుడిని ప్రార్థిస్తూ...

ఇట్లు : కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు : తేది. 01.03.2017 బుధవారం నెల్లూరు నగరం, పొగతోట కె.వి.అగ్రహారంలోని మూన్‌ల్యాండ్స్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న మా స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com